
సబ్‌కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న రెవెన్యూ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, కలెక్టర్ శ్రీధర్

ప్లాట్లు అమ్ముకున్నారు..!

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం.. నవరత్నాలు.. పేదలందరికీ.. ఇళ్లు... జగనన్న కాలనీ పేరుతో ఎంతో ఆర్భాటం చేసింది. జిల్లాలో ఈ కాలనీల కోసం ఎక్కువగా గుట్టలు, కొండలు, వాగులు, వంకల్లో స్థలాలను ఎంపిక చేశారు. అయితే కొన్నిచోట్ల మాత్రం ఎంతో విలువైన ప్రదేశాల్లో జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న స్థలాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేయించిన కొందరు వైసీపీ నాయకులు ఆ కాలనీల్లో పేదల పేరుతో ఇంటి పట్టాలు తీసుకుని వాటిని అమ్ముకుని కోట్ల రూపాయలు తమ జేబుల్లో వేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ అక్రమాలు వెలుగులోకి రావడంతో ప్రస్తుతం ఆ పట్టాలన్నింటినీ రద్దు చేయడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీంతో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును వైసీపీ నాయకుల చేతుల్లో పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు.


జగనన్న కాలనీలో లేఅవుట్

- జగనన్న కాలనీలో వైసీపీ నాయకుల దందా
- ఒక్కో ప్లాటు రూ.10 నుంచి 15 లక్షలు
- బెంగళూరు రహదారికి పక్కనే కాలనీ ఏర్పాటు
- ఆ ప్లాట్ల రద్దుకు అధికారుల నిర్ణయం
- ప్లాట్లు కొన్న వారి పరిస్థితేంటో?


కాలనీలో ఇంటి నిర్మాణం కోసం తీసిన గుంతలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మద్యం, ఇసుక, గనులు వేటినీ వదలకుండా దోచుకున్న కొందరు వైసీపీ నాయకులు వైఎస్సార్ జగనన్న కాలనీ పేరుతోనూ దోపిడీ చేశారు. జాతీయ రహదారులకు ఆనుకుని, పట్టణాలకు సమీపంలోనూ జగనన్న కాలనీలను ఏర్పాటు చేయించిన కొందరు వైసీపీ నాయకులు అందులో ప్లాట్లను అమ్ముకుని కోట్ల రూపాయలు దోచుకున్నారు. చిన్నమండెం మండలం కేశాపురం గ్రామ పంచాయతీలోని హంద్రీ-నీవా కాలువ పక్కన రెడ్డివారిపల్లె దగ్గర సర్వే నెంబరు 231/4 ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కేశాపురం పంచాయతీ రెడ్డివారిపల్లె వద్ద కడప-బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి, హంద్రీ-నీవా కాలువకు వెళ్లిన భూమిలో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో 95 ప్లాట్లు మంజూరు చేశారు. ఎన్నికలకు మూడు నెలల ముందు ఆర్భాటంగా ఈ కాలనీలో లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కడప-బెంగళూరు జాతీయ రహదారికి 1 నుంచి 12 ప్లాట్లను కేటాయించారు. రోడ్డుకు ఉండే ప్లాట్లు రూ.10 నుంచి రూ.15 లక్షల చొప్పున, లోపలికి ఉండే ప్లాట్లు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున అమ్ముకున్నట్లు తెలుస్తోంది. అలాగే తాము చెప్పినంత డబ్బు ఇచ్చిన వాళ్లకే ఇంటి పట్టాలు కూడా ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా గత ప్రభుత్వంలో జరిగింది అనుకుంటే ఏదోలే అనుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఈ కాలనీలో వైసీపీ నాయకులు దర్జాగా ఇంటి పట్టాలను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు. అయితే ఈ విషయం ఈ నోటా.. ఆ నోటా పడి బయటకు పొక్కింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ జగనన్న కాలనీలో ప్లాట్లను రద్దు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో లక్షల రూపాయలు పెట్టి ప్లాట్లను కొన్న వాళ్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న కాలనీకి ఎటువంటి అనుమతులు లేవు

కేశాపురం గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె కాలువ వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి హౌసింగ్‌లో ఎటువంటి ప్రతిపాదన లేదు. అదేవిధంగా ఎటువంటి అనుమతులు లేవు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు ఇచ్చి ఉండవచ్చు ఏమో మాకు తెలియదు.

- మహేంద్రరెడ్డి, ఏఈ, హౌసింగ్

పట్టాలన్నింటినీ రద్దు చేస్తున్నాం..

వైఎస్సార్ జగనన్న కాలనీకి సంబంధించి గతంలో 95 ప్లాట్లు మంజూరు చేశారు. అయితే అక్కడ నిర్మాణాలు జరగలేదు. వాటన్నింటినీ పూర్తి స్థాయిలో రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. అందులోఎవరైనా నిర్మాణాలు చేపట్టినా.. వాటిని కూల్చివేస్తాం.

- నరసింహులు, తహసీల్దార్, చిన్నమండెం


బెంగళూరు రోడ్డుకు ఆనుకుని ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ

మదనపల్లె సబ్ కలెక్టరేట్ పునఃప్రారంభం

- ప్రారంభించిన ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా
- రూ.70 లక్షలతో నూతన సొబగులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టరేట్‌ను బుధవారం రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా పునఃప్రారంభించారు. గత ఏడాది జూలై 21వ తేదీ రాత్రి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫ్రీహోల్డ్ భూముల ఫైళ్ల ఆధారాలు మాయం చేయాలనే దురుద్దేశ్యంతో కొంతమంది సబ్‌కలెక్టరేట్‌ను దహనం చేయడంతో మొత్తం పరిపాలనా భవనం అంతా కాలిపోయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా కాలిపోయిన సబ్‌కలెక్టరేట్ పరిపాలనా భవనం మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.70 లక్షలు కేటాయించగా సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ దగ్గరుండి మరమ్మతు పనులు పూర్తి చేయించారు. ఐఎస్‌వో ప్రామాణికాలతో అగ్నిప్రమాదం జరిగినా ఆర్పివేసే పరికరాలతో, కొత్త హంగులతో రూపుదిద్దుకున్న సబ్‌కలెక్టరేట్‌ను రెవెన్యూ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా రిబ్బన్ కట్ చేసి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ చాంబర్‌లో ఇద్దరు తహసీల్దార్లను పిలిచి పలు అంశాలపై విచారించారు. కార్యక్రమంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లు పాల్గొన్నారు.

174 కేజీల గంజాయి స్వాధీనం

- విలువ రూ.17.40 లక్షలు 6
- చిన్నమండెంకు చెందిన భార్యాభర్తల అరెస్టు

మోడల్ మార్కెట్‌లో రూ.కోట్లు వృథా..!

- శిథిలమవుతున్న భవనాలు 6
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ సర్కార్
- కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని రైతుల వేడుకోలు

మహాశివరాత్రికి 81 ప్రత్యేక బస్సులు

వివరాలు.. 6లో

దేవపట్ల వద్ద బౌండరీ ట్రెంచ్ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు



కరువుకు ఉపాధి తోడ్పాటు


- ఒక్కొక్క కుటుంబానికి 150 రోజుల పని
- జిల్లాలోని 19 మండలాలకు వర్తింపు

సంబేపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాల్లో పేదలకు ఉపాధి పనులు ఆసరాగా ఉంటున్నాయి. స్థానికంగా పనులు కల్పించి వలసలను నివారించాలన్న సంకల్పంతో 2005లో ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పేదలు లబ్ధి పొందుతున్నారు. ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకంతో సంవత్సరానికి వంద రోజులు పనిదినాలను కల్పిస్తూ ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 54 కరువు మండలాల్లో పని దినాలను మరో 50 రోజుల పాటు పొడిగిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు. అన్నమయ్య జిల్లాలోని 19 కరువు మండలాల్లోని ఉపాధి హామీ కుటుంబాల వారు లబ్ధి పొందనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కరువును ఎదుర్కొనేందుకు వలసలు వెళ్లకుండా నివారించేందుకు ఉపాధి హామీ పథకం తోడ్పాటుగా నిలుస్తుందని చెప్పవచ్చు.

జిల్లాలోని కరువు మండలాలు ఇవే

జిల్లాలోని 30 మండలాల్లో వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్ నష్టాలను పరిశీలించి 19 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మండలాల్లో ప్రతి కుటుంబానికి 150 రోజులు ఉపాధిలో పనిదినాలను కల్పిస్తున్నారు. సంబేపల్లె, గాలివీడు, చిన్నమండెం, సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి, తంబళ్లపల్లి, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లి మండలాలు ఉన్నాయి.

ప్రతి కుటుంబానికి 150 రోజులు పని కల్పిస్తాం..



మండలంలో ప్రతి కుటుంబానికి 150 రోజులు పనిదినాలు కల్పిస్తాం. మండలంలో 9972 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో యాక్టివ్ జాబ్‌కార్డ్స్ 8795 ఉన్నాయి. మండలంలో 459కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకున్నాయి. ప్రస్తుతం 50 రోజులు పనిదినాలను అదనంగా ఈ కుటుంబాలకు కల్పిస్తాం. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 6983 కుటుంబాలకు చెందిన 10,682 మంది కూలీలకు పనులు కల్పించాం.

- రామచంద్ర, ఎంపీడీవో, సంబేపల్లె మండలం

150 రోజుల పనులు వినియోగించుకోవాలి



ప్రతి కుటుంబం ఉపాధి హామీ ద్వారా స్థానికంగా 150 రోజులు పనిదినాలను వినియోగించుకోవాలి. కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- మల్లు నరసారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు, సంబేపల్లె


దుద్యాల వద్ద నీటి నిల్వ పనులు చేస్తున్న దృశ్యం

పోరాటయోధుడు ఛత్రపతి శివాజీ

- నందలూరులో కూటమి నేతల ర్యాలీ

నందలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహా పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, జనసేన పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం ఛత్రపతి శివాజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డిపల్లెలోని మారెమ్మతల్లి ఆలయం నుంచి బస్టాండు కూడలి వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు హిమగిరినాధ్‌యాదవ్, బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య, పోతుగుంట రమేష్‌నాయుడు, జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, టీడీపీ నాయకులు ఆర్ముగం, విశ్వనాథ్, వాణి, చామంచి పెంచలయ్య, మట్టి బాబు, కుర్రా మణియాదవ్, పెద్దఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.


నందలూరులో ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు

నాటుసారా, గంజాయి నిర్మూలిస్తాం

- ఎక్సైజ్ డీసీ జయరాజ్

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 పథకంతో గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలను అరికడతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.జయరాజ్ తెలిపారు. బుధవారం మదనపల్లె, రామసముద్రం మండలాల్లోని కర్ణాటక సరిహద్దు చీకిలబైలు, రామసముద్రం చెక్‌పోస్టులను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.మధుసూదన్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసే గ్రామాలను గుర్తించామని, అక్కడి ప్రజలకు నాటుసారా తయారీ బదులు ప్రభుత్వం ఇచ్చే రుణాలతో జీవనం సాగించే విధంగా నవోదయ 2.0 పథకం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పట్టణాల్లో గంజాయి రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కర్ణాటక నుంచి వచ్చే ఎన్‌డీపీఎల్ మద్యం రవాణా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీసీ జయరాజ్

ప్రజల్లో విశ్వసనీయత పెరగాలి

- క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లపై కఠినంగా వ్యవహరించాలి
- నేర సమీక్షలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. నేర నిరూపణలకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేర పరిశోధన చేయాలని, పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అంతేగాక గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక ప్రాధాన్యతతో ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


నెలవారీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

గుట్టను గుల్ల చేశారు...

- అధికారులు బోర్డు నాటారు...
- బోర్డు పీకేసి మొక్కలు నాటిన కబ్జాదారుడు
- కలెక్టర్ మాటంటే లెక్కలేదా?
- ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో అధికారులు విఫలం


గుట్టను తవ్విన దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల ఆక్రమణల్లో తగ్గేది లేదంటూ కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు. ఇది ప్రభుత్వ స్థలం అని అధికారులు బోర్డులు నాటితే వాటిని తొలగించి ఏకంగా మొక్కలు నాటుతున్నా పట్టించుకునేవారే లేరన్న ఆరోపణలు వస్తున్నాయి. సుండుపల్లె మండలంలో గుట్టలు, చెరువులు, కొండలు, విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ పట్టాలు సృష్టించి తమ కబ్జాదారులు తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా కూడా సరైన చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులు ఆగడం లేదు. నెల రోజుల క్రితం మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ కొత్తపల్లె సమీపంలో భట్రాజుగారిపల్లెకు వెళ్లే దారిలో మొరం గుట్టలను కొత్తపల్లెకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించాడు. రెండు గుట్టల మధ్యలో ఉన్న తన పట్టా భూమి పక్కన సుమారు 5 ఎకరాలకుపైగా గుట్టను చదును చేసి ఆక్రమించాడు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుట్టను చీల్చి మట్టిని తరలించినా కూడా అధికారులు పెద్దగా చర్యలు తీసుకోలేదు. తూతూ మంత్రంగా ప్రభుత్వ స్థలం అని బోర్డు నాటి చేతులు దులుపుకున్నారు. అయితే రెండు రోజుల క్రితం తన పట్టా భూమితో పాటు ఆక్రమించిన స్థలంలో ఆ వ్యక్తి మామిడి మొక్కలు నాటాడు. అధికారులు నాటిన బోర్డును మాయం చేశాడు. ఇంత విచ్చలవిడిగా గుట్టలు అన్యాక్రాంతం అవుతుంటే సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ మాటంటే లెక్కలేదా?

సుండుపల్లె మండలంలో ప్రభుత్వ స్థలాలు కాపాడాలని మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్వయంగా మండల కేంద్రానికి సమీపంలో కంచిపాటివాండ్లపల్లె దగ్గర గుట్ట ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ప్రస్తుతం తిమ్మసముద్రం కొత్తపల్లె సమీపంలో రెండు గుట్టలను ఆక్రమించి నాటిన బోర్డులు మాయం చేసి మొక్కలు నాటిన వారిపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ అధికారుల పనితీరు దయనీయంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. పైగా అధికారుల పనితీరుపై కలెక్టర్, సబ్‌కలెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేసినా వారి తీరు మారడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మొరం గుట్టలు ఆక్రమణలకు గురయ్యాయని రెవెన్యూ సిబ్బంది నాటిన బోర్డులు మాయం చేసి మొక్కలు నాటారని ఆంధ్రజ్యోతి తహసీల్దార్ దైవాదీనం దృష్టికి తీసుకెళ్లగా రెవెన్యూ సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ప్రభుత్వ స్థలం అని బోర్డు నాటిన అధికారులు (ఫైల్)


బోర్డు పీకేసి గుట్ట స్థలం ఆక్రమించి నాటిన మామిడి మొక్కలు

మోడల్ మార్కెట్‌లో..

రూ.కోట్లు వృథా..!



చింతపర్తి మార్కెట్ యార్డు

- శిథిలమవుతున్న భవనాలు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ సర్కార్
- కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని రైతుల వేడుకోలు



చింతపర్తి మార్కెట్ యార్డులో మందుబాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు



వాల్మీకిపురం మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వ్యాపార దుకాణాల సముదాయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సరిగ్గా 13 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ నేడు శిథిలావస్థను తలపిస్తోంది. కోట్ల ప్రజాధనం వృథా కావడంతో పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. వాల్మీకిపురం సమీపంలోని మద్రిపాడు మార్గంలో 2013లో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.3.40 కోట్ల వ్యయంతో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డును ప్రారంభించారు. మంచి సంకల్పంతో రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా రూపుదిద్దుకోవాలన్న అప్పటి ప్రభుత్వం, పాలకుల ఆశలు నీరుగారాయనే చెప్పాలి. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, పాలకులు ఏమాత్రం రైతుల సౌకర్యాలు, అవసరాలు గుర్తించకపోవడంతో నేడు మార్కెట్ శిథిలాలను తలపిస్తోంది. వాల్మీకిపురం మార్కెట్ ప్రారంభించిన రోజుల్లో వాల్మీకిపురం, కలకడ మండలాల ప్రాంతాల నుంచి ప్రతినిత్యం సుమారు 150 టన్నుల టమోటాలు మార్కెట్‌కు రావడం, క్రయవిక్రయాలతో సందడి వాతావరణం ఉండేది. కాలక్రమేణా ఇక్కడి మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లో టమోటా పంట సాగవుతూ నిత్యం రైతులు, వ్యాపారుల సందడితో కళకళలాడే మార్కెట్ నేడు వెలవెలబోతోంది. అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన భవనాలు కూడా వృథాగా మారాయి. రైతులు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఉపయోగంలోకి తెచ్చిన పాపాన పోలేదు. యార్డు ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ కూడా మరుగున పడింది. కనీస సౌకర్యాలు, పర్యవేక్షణ లేకనే రైతులు వాల్మీకిపురం మార్కెట్‌కు రావడం లేదన్న వాదన గట్టిగా వినిపిస్తుండటం గమనార్హం. ఎటువంటి రక్షణ లేకపోవడంతో మార్కెట్ యార్డు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతున్నాయి.

అలాగే మండలంలోని చింతపర్తి గ్రామంలో గల మార్కెట్ యార్డు కూడా దుస్థితికి చేరుకుంది. రైతుల ఉపయోగం ఎలా ఉన్నా ఎవరికి తోచిన రీతిలో వారు వాడుకుంటున్నారు. మార్కెట్ కార్యాలయ భవనాలు కూడా అక్రమ నిల్వల గోదాముగా మారిపోవడం గమనార్హం. ఎటు చూసినా మందుబాబుల ఆగడాలతో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రూ.1.57 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డు ప్రస్తుతం ఎటూ కాకుండా నిరుపయోగంగా మారింది. గత వైసీపీ పాలనలో వ్యవసాయ మార్కెట్లను పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమైనా వ్యవసాయ మార్కెట్ యార్డులపై దృష్టి సారించాలని కోరుకుంటున్నారు. చింతపర్తి మార్కెట్ ఎంతో అనుకూలంగా ఉండేదని, ప్రస్తుతం కలకడ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోందని సమీప గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ల తీరుతో మండీల యజమానులు కూడా తాము వ్యాపారాలు కోల్పోయి ప్రతినెలా చేతి నుంచి బాడుగలు కట్టే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తుండటం గమనార్హం. వాల్మీకిపురం యార్డు ఆవరణలో 8 వ్యాపార దుకాణ సముదాయాలు ఉన్నప్పటికీ ఏళ్లకాలంగా తెరచుకోకపోవడం వ్యాపారాలు కొనసాగకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి మార్కెట్ యార్డుల సముదాయాలలో సౌకర్యాల కల్పన, పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ సెక్రటరీ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. రైతులు మార్కెట్‌కు రాకపోవడం కారణంగా ఈ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పడం కొసమెరుపు.

మార్కెట్ లేక ఇబ్బందులు



చింతపర్తి వ్యవసాయ మార్కెట్ లేకపోవడంతో కలకడ, కలికిరి, మదనపల్లె ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతకు మించి పండించిన టమోటా పంట రవాణా ఖర్చులు కూడా భారంగా మారుతున్నాయి. ప్రభుత్వం చింతపర్తి మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ఎన్.ఆనంద్, రైతు, పెరుమల్లయ్యగారిపల్లె, వాల్మీకిపురం

రైతుల గోడు పట్టించుకోవాలి



మా గ్రామానికి 5 కి.మీ. దూరంలో ఉన్న మార్కెట్‌యార్డు మూతపడడంతో 25 కి.మీ. దూరంలో కలకడ మార్కెట్‌కు టమోటాలను రవాణా చేయాల్సి వస్తోంది. గడ్డు పరిస్థితులలో సైతం రైతులు తీవ్రంగా నష్టపోయిన సమయాన రవాణా ఖర్చుల భారం, పంటల నష్టం కోలుకుండా చేస్తోంది. అదే మా గ్రామ సమీపంలో ఉన్న చింతపర్తి మార్కెట్‌లో ప్రభుత్వం చొరవ చూపి బాగు చేసినట్లయితే సమీప గ్రామ రైతులందరికీ ఎంతో మేలు కలుగుతోంది. పాలకులు, రైతులు కూడా రైతుల సమస్యలు, ఇబ్బందులను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-జయచంద్రనాయుడు, రైతు, శాకంవారిపల్లె, వాల్మీకిపురం

ఇష్టారాజ్యంగా

నిధుల దుర్వినియోగం

చిన్నగొల్లపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సుండుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న గొల్లపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయంటూ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య గత డిసెంబరు లో కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అదే నెలలో విచారణ చేశారు. రూ. 1,13,100 సాధారణ నిధులు, రూ. 2,63,125 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేల్చారు. దీంతో చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో మస్తాన్‌వలి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు బుధవారం తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని ఫిర్యాదుదారు రెడ్డిచర్ల శివశంకరయ్య ఆరోపిస్తున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

రామసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీపల్లెలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అయితే వారు వచ్చేలోపే గడ్డివాములకు మంటలు పూర్తిగా వ్యాపించాయి. సిబ్బంది మంటలార్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామానికి చెందిన ఆర్.చెంగారెడ్డి, పి.చంద్రప్పకు చెందిన గడ్డి వాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.60 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకుకు గాయాలు

రామాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి కథనం మేరకు రాయచోటి పట్టణానికి చెందిన తిరుపతి చంద్ర తన కుమారుడు సాయికుమార్‌తో కలసి బైక్‌పై రామాపురం మండలం రాచపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు వెళ్లి వస్తుండగా, చిట్లూరు హరిజనవాడ సమీపంలో కుక్కను తప్పించే యత్నంలో బైక్ అదుపు తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని 108 వాహనంలో క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురికి జైలుశిక్ష

కలకడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో నిందితులైన నలుగురికి వాల్మీకిపురం కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు బుధవారం పేర్కొన్నారు. ఆయా కేసుల్లో నిందితులైన నాగేంద్ర, బాలాజి, షాబ్‌జాన్, వెంకటరమణలను బుధవారం వాల్మీకిపురం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.16 వేలు జరిమానా, వారం రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

174 కేజీల గంజాయి స్వాధీనం

- విలువ రూ.17.40 లక్షలు
- చిన్నమండెంకు చెందిన భార్యాభర్తల అరెస్టు

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.17.40 లక్షల విలువైన 174 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... మంగళవారం రాత్రి వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ39వీఏ9012 నెంబరు గల ఆటో పోలీసులను గమనించి వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా గుర్తించిన పోలీసులు ఆటోను వెంబడించి పట్టుకున్నారు. దానిని పరిశీలించగా అందులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ, రాజమ్మ దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆటోతో పాటు గంజాయిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందులో పరిశీలించగా 90 ప్యాకెట్లలో 174 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు సూత్రధారులు పరారయ్యారని పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వేదపండితులు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామివారి కలాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, ధనుష్ సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 81 ప్రత్యేక బస్సులు



యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న మదనపల్లె-1 డిపో మేనేజర్ వెంకట్రమణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం 81 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ మూరే వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ వన్‌డిపోలో బుధవారం అన్ని యూనియన్ నాయకులతో రూట్ సూపర్‌వైజర్లు గ్యారేజ్ సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మదనపల్లె నుంచి తంబళ్లపల్లె వరకు 20 బస్సులు, తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి కొండ కిందకు 10 సర్వీసులు, కొండ కింద నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ పైకి 35 సర్వీసులు నడుపుతున్నట్లు బీఎం పేర్కొన్నారు.

ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు కండెక్టర్ ఉంటారని తెలిపారు. అలాగే పెద్దమండ్యం-తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2 బస్సులు, బి.కొత్తకోట-తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2, ములకలచెరువు -తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. మదనపల్లె వన్ డిపో- అంగళ్లు సమీపంలోని మల్లయ్యకొండకు 10 బస్సులు నడుపుతున్నామన్నారు. ఇదిలా ఉండగా తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి ఆధ్వర్యంలో పెద్దమండ్యం, బి.కొత్తకోట, ములకలచెరువు నుంచి మూడు ఉచిత బస్సులను భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, బాబ్జి, వి.వి. రమణ రెడ్డి, బాషా, శివయ్య, ఎంసీ శేఖర్ చంద్రయ్య, అసిస్టెంట్ మేనేజర్ రేవతి, ఎం.ఎఫ్. రవి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రార్థన స్థలం విషయంలో వాగ్వాదానికి దిగిన రెండు వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలోని హైస్కూల్ వెనుక ఉన్న ప్రార్థన స్థలం విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వివాదాస్పద స్థలం వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని వివరించారు. ఎవరైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ కట్టడం కూల్చివేత



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

రాజంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. రాజంపేట మండలం కూచివారిపల్లెలో వత్తలూరు ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్సు నిర్మించారని ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఆధ్వర్యంలో విచారణ చేసి, సర్వే నంబరు మార్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు , ఈ ప్రాంతంలో దాదాపు రెండు ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇందులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును బుధవారం సబ్‌కలెక్టర్ నిదియాదేవి ఆధ్వర్యంలో తహసీల్దారు పీరుమున్నీ, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు.

గుండాలకోనకు 12 శాశ్వత కాశీ శివలింగాలు



చిట్వేలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలకోన కర్కటేశ్వర స్వామి సన్నిధికి 12 శాశ్వత పంచామృత కాశీ శివలింగాలు ప్రతిష్ఠించనున్నట్లు గుండాలకోన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాశీ శివలింగాలను పెద్దూరు గ్రామానికి ప్రత్యేక పూజలతో గ్రామోత్సవంగా తీసుకువచ్చారు. అనంతరం రాత్రికి గుండాలకోనకు శివలింగాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యా! ఏడు నెలలైనా..

- సిసోడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్న బాధితులు

మా సమస్యలు పరిష్కరించలేదు



రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అయ్యా.. ఏడు నెలల క్రితం మీరు మదనపల్లెకు వచ్చినప్పుడు తాము ఇచ్చిన అర్జీలు ఇంత వరకు పరిష్కారం కాలేదని పలువురు అర్జీదారులు రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియాతో మొరపెట్టుకున్నారు. బుధవారం మదనపల్లెకు వచ్చిన సిసోడియాతో పలువురు అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. సిసోడియాకు గతంలో ఇచ్చిన అర్జీలపై కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు పలుసార్లు అర్జీలు ఇచ్చామని, ఇంతవరకు ఆయా మండలాల తహసీల్దార్లు తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. ముఖ్యంగా భూముల వివాదాలు, వన్-బీలో పేర్ల నమోదు, సర్వే సమస్యలపై అధికారులు నాన్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 మందికి పైగా ప్రజలు సిసోడియాకు అర్జీలు అందజేశారు. ఈ అర్జీలన్నింటికి టాప్ ప్రియారిటీ ఇచ్చి, విచారించి పరిష్కరించాలని, కోర్టు కేసులుంటే ఎండార్స్‌మెంట్లు ఇవ్వాలని సిసోడియా సబ్‌కలెక్టర్‌కు సూచించారు.

భూములకు పాసుపుస్తకాలు ఇవ్వండి



మా పిత్రార్జితంతో పాటు, నేను కొనుగోలు చేసిన భూములకు పాసుపుస్తకాలు మంజూరు చేయండి. కోర్టులో మాకు అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు మా ప్రత్యర్థుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై పూర్తిగా విచారించి మాకు న్యాయం చేయండి. ఏడు నెలలుగా నా సమస్య పరిష్కారం కాలేదు.

- రామచంద్రారెడ్డి, వెంగంవారిపల్లె, నిమ్మనపల్లె మండలం.

మా భూములపై ఇతరులకు వన్-బీ ఇచ్చేశారు



మదనపల్లె మండలం బసినికొండ రెవిన్యూ గ్రామం కొండామరిపల్లెలో సర్వే నెంబర్ 431లో తమకు చెందిన భూములకు వన్-బీ మంజూరుకు ఏడు నెలల క్రితం అర్జీ ఇచ్చాము. ఆ భూమికి సంబంధించి వేరే వారికి వన్-బీ మంజూరు చేశారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయండి సార్. ఏడు నెలల నుంచి అన్ని కార్యాలయాలకు తిరుగుతున్నా న్యాయం జరగలేదు.

- ఏ.వెంకటరమణారెడ్డి, కొండామద్రిపల్లె, మదనపల్లె మండలం.

వివాదాల భూమిని డిస్ప్యూట్ రిజిస్టర్‌లో పెట్టండి



కురబలకోట మండలం మట్టివారిపల్లె గ్రామం సర్వే నెంబర్ 630/1లోని 6.69 సెంట్ల భూమిపై వివాదం నడుస్తోంది. పూర్తి విచారణ అయ్యేంత వరకు ఈ భూమిపై ఎవరికి పాసుపుస్తకాలు మంజూరు చేయొద్దు. దీనిపై పలుమార్లు అర్జీలు సమర్పించాను. ఇప్పటికే తహసీల్దార్, సబ్‌కలెక్టర్‌కు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. దీనిపై విచారించి ఈ భూమి వివరాలను డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదు చేయించాలి.

- దావూద్‌ఖాన్, సీటీఎం, మదనపల్లె మండలం.

రోడ్డు రోలర్ కింద పడి వ్యక్తి మృతి



వివరాలు సేకరిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉండగా మూర్ఛ రావడంతో రోడ్డు రోలర్ డ్రైవర్ తాను నడుపుతున్న వాహనం కిందే పడి మృతి చెందిన హృదయ విదారకమైన సంఘటన మండల పరిధిలోని మంగంపేట పరిధిలో బుధవారం చోటుచేసుకుంది.

రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు కడప జిల్లా సీకె దిన్నె మండలానికి చెందిన కిరణ్‌కుమార్(36) రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఆయన రోడ్డు రోలర్‌తో మండల పరిధిలోని గోవిందంపల్లె - మంగళంపల్లె రోడ్డు మలుపు వద్ద వెళుతుండగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి, అదే వాహనం కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

పట్టపగలే చోరీ



ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్ టీం

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిర్మలగిరికాలనీలోని ఓ ఇంట్లో పట్టపగలే జరిగింది. బాధితుడి కథనం మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు ఆర్‌ఎంపీ వైద్యుడు వీరభద్రుడు ఇంటికి తాళాలు వేసి మాధవరంలో ఉన్న క్లినిక్‌కు వెళ్లగా, ఆయన భార్య వీరమ్మ బ్యాంకు పనిమీద నందలూరుకు వెళ్లింది. ఉదయం 11 గంటలకు ఇంటికి వెళ్లగా, తలుపులకు ఉన్న తాళాలు తొలగించినట్లు కనిపించడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, బీరువా పగులగొట్టి అందులోని రూ. 2 లక్షలు నగదు, 30 తులాల బంగారం అపహరించినట్లు తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, క్రైం సీఐ భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు బాధితుడు తెలిపాడు.

పొలం పిలుస్తున్నా... రారేమి...!



పొలం పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

- కార్యక్రమంపై అవగాహన భ్రమ
- పత్తాలేని అనుబంధ శాఖల అధికారులు
- మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులను సాగులో సుశిక్షితులను చేసి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు గ్రామాల్లోని రైతుల క్షేత్రాలను సందర్శించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, పురుగులు, తెగుళ్ల, నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అన్ని సమస్యలపై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు మినహా మిగిలినవారు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ కార్యక్రమం ప్రభుత్వ లక్ష్యానికి దూరం అవుతోంది.

వారానికి నాలుగు గ్రామాలు

ఉమ్మడి కడప జిల్లాలో 66 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 66 మండలాల్లో ఒక్కో మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున 264 గ్రామాలు, నెలకు దాదాపు 1056 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

నిర్వహణ సాగాలిలా...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలం బాట, పంట సాగుపై చర్చలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర సమస్యలకు తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహించాలి.

మిగతావారేరి...

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖలైన హార్టికల్చలర్, సిరికల్చలర్, ఫిషరీస్, వెటర్నరీ శాఖ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, విద్యుత్తు, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వీరితోపాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీ, సబ్సిడీలను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. 2024-25 ఏడాదికి సంబంధించి సెప్టెంబరు 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి విడత షెడ్యూలు పూర్తయి ప్రస్తుతం రెండో విడత షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రబీ సీజన్ కావడంతో అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. మొదటి షెడ్యూలులో జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన శాఖ అధికారుల జాడ లేదని రైతులు వాపోతున్నారు.

> **అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలి**
>
> పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు అన్ని అనుబంధ శాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలి. ఆయా శాఖల పథకాలను తెలియజేసి, రైతుల సమస్యలు పరిష్కరించాలి. అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా చూస్తాం.
>
> - నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



అవగాహన కార్యక్రమానికి హాజరైన కొందరు రైతులు

ముందస్తు సమాచారం లేక వెలవెల

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు వారి షెడ్యూళ్ల ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చాలా మందికి అవగాహన భ్రమగానే మారిందని విమర్శలు ఉన్నాయి.

పొలతలలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతలలో జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమా ర్‌లు తెలిపారు. పొలతల క్షేత్రంలోని పరిపాలన భవనంలో కలెక్టర్, ఎస్పీలు వివిధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వ హించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు తాగునీరు, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా, నిరంతరం వైద్య శిబిరాలు, 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడా లన్నారు. భక్తులకు కోసం బస్సులు నడపాలని, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలని, కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్ల మర మ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్యూలైన్లు, సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవం సమయంలో గట్టి పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. ముందుగా మల్లేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, ఈఈ కృష్ణానాయక్, జెడ్పీ సీఈఓ ఓబు లమ్మ, డీఎంహెచ్ఓ నాగరాజు, డీపీవో రాజ్యలక్ష్మి, ఆలయ పెద్దలు రాజారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మొల్లసాహితీ పురస్కార ప్రదానం



మలయవాసిని విఠలరావు దంపతులు, ఆచార్య విజయలక్ష్మికి పురస్కారం ప్రదానం చేస్తున్న గానుగపెంట

కడప కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కోలవెన్ను మలయవాసిని విఠలరావు దంపతులకు, హైదరాబాదు సెంట్రల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు ఆచార్య విజయలక్ష్మికి మొల్ల సాహితీ పురస్కారాలను అందించారు. బుధవారం స్థానిక కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో వారిని సత్కరించి నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఆచార్య మలయవాసిని మొల్ల రామాయణానికి పరిమళం అనే పేరుతో 435 పేజీలతో విశేష వ్యాఖ్యానం రాసి తెలుగు జాతికి మహత్తర కానుకగా అందించారు. ఈ గ్రంథాన్ని టీటీడీ వారు ముద్రించారు. కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహా కవయిత్రి పేరుతో సాహిత్య పీఠాన్ని నెలకొల్పి.. రెండు దశాబ్దాలకు పైగా ఆమె జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న విద్వాన్ గానుగపెంట హనుమంత రావు అభినందనీయుడన్నారు. మొల్ల సాహిత్యపీఠం కార్యాలయంలో నిక్షిప్తం చేసిన గ్రంథాలయాన్ని, జ్ఞాపికలను, ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశీలించి ప్రశంసించారు. తాను రాసిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్యను సాహిత్యపీఠానికి అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పకృతి వ్యవ సాయంపై రైతుల్లో అవగాహ న పెంపొందించి, ఔత్సాహిక రైతులకు వనరులను సమకూర్చాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీ ఆర్ఎస్ హాలులో రాష్ట్ర వ్యసాయశాఖ, రైతు సాధికారసంస్థ సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) జిల్లాలో అమలు తీరు, విస్తరణపై వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయసాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ సహాయకుల, వ్యసాయాధికారులు, హార్టికల్చర్ సహాయకులు అధికారులు బాధ్యత వహించాలన్నారు. సంప్రదాయ వ్యవసాయసాగు పద్ధతులను అమలు చేసేందుకు గ్రామాలను యూనిట్‌గా తీసుకొని వీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఈప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో స్థలం అనుకూలత ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో లేదా పాఠశాలల్లో న్యూట్రీన్ గార్డెన్స్ ఏర్పాటుకు మ్యాపింగ్ చేయాలన్నారు. బయో డైవర్సిటీ విధానం ద్వారా అన్ని రకాల పంటలను పండించేలా రైతులను, యువతను ప్రోత్సహించాలన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ నాగేశ్వరరావు

ఆటో బోల్తా - వ్యక్తి మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు సమీపంలో మంగళవారం ఆటో బోల్తాపడి గాయపడిన ముత్యాలపాడు మునెయ్య (37) బుధవారం కర్నూలులోని ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. సంఘటనలో అతని భార్య, ముగ్గురు పిల్లలకు స్వల్పగాయాలైనట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహిళ ఆత్మహత్య

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన ఆవుల సురేఖ అనే మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. భర్త శ్రీనివాసులతో మనస్పర్థలు ఉండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని...

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామక్రిష్ణనగర్‌కు చెందిన ఉరి వేసుకుని చిన్నముజాహ్నవి (15) ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. చిన్నముజాహ్నవి పదోతరగతి వరకు చదివి ఇంటి వద్ద ఉంటోంది. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా ముగిసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పులివెందుల రూరల్, ఫిబ్రవరి 19: పులివెందులలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బ్రహ్మోత్స వాలలో భాగంగా ప్రతి రోజూ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చివరి రోజైన బుధవారం హంస వాహనం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివా రిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీ కర్‌రెడ్డి, ఈవో కొట్టే వెంకటరమణ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కాశినాయన ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె నర్సాపురం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో కాశినాయన మండలం చాలా వెనుకబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. తహసీల్దారు వెంకటసుబ్బయ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వాటికి పరిష్కార మార్గాలు చూపాలని జేసీ అతిధిసింగ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాల యాన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ సదస్సుల్లో స్పందనలో వచ్చిన అర్జీల గురించి విచారించారు. వీలైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి కార్యాలయాల చుట్టూ తిరగకుండా పరిష్కారమార్గాలు చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూవివాదంపై అన్నదమ్ముల మధ్య ఘర్షణ



గాయపడిన సుబ్బయ్య, శ్రీనివాసులు

కాశినాయన ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లెలో భూ సమస్యపై అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో రెండు కుటుంబాల వారికి రక్తగాయాలయ్యాయి. ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోడెపాటి శ్రీనివాసులు, సుబ్బయ్య ఇరువురు అన్నదమ్ములు. వీరి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూవివాదం నడుస్తోంది. ఈస్థలంలో మంగళవారం శ్రీనివాసులు గోకులం షెడ్డు నిర్మించేందుకు యత్నించాడు. సుబ్బయ్య అడ్డుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు కర్రలతో రాళ్ళతో దాడి చేసుకున్నారు. ఈసం ఘటనలో శ్రీనివాసులకు, సుబ్బయ్యకు కొంతమందికి రక్తగాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు రెండు కుటుంబాల వారిపై కేసు నమోదు చేశామన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రోహిత్



కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో 22 నుంచి 26 వరకు జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కడపలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీకాలేజీ విద్యార్థి రెడ్డి రోహిత్ కుమార్ ఎంపికయ్యారు. 2024 అక్టోబ రులో నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రెడ్డి రోహిత్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఆ విద్యార్థి ఎంపిక పట్ల సం బంధిత కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి హర్షం వెలిబుచ్చారు.

ఏడేళ్లుగా వేతనాల పెంపులేదు.. జీవనం ఎలా?

వేంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం రూ.25వేల వేతనంతో చేరాం.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదు.. ఇలాగే కొనసాగితే మేము ఎలా జీవనం సాగించాలంటూ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేసే తాత్కాలిక అధ్యాపకుల అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డైరెక్టర్ కుమారస్వామి గుప్తకు వినతి పత్రం అందించారు. 110జీఓ ప్రకారం రూ.33వేల వేతనం ఇవ్వాలని కోరారు. వచ్చే నెల నుంచి అమలయ్యేలా చూడాలని, సమస్యను రిజిస్ట్రార్, వీసీల దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. సమస్యను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డైరెక్టర్ తాత్కాలిక అధ్యాపకు లకు తెలిపారు.



డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకులు

ట్రిపుల్‌ఐటీలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమా రస్వామి గుప్త తెలిపారు. క్యాంపస్ ఆవర ణలో ట్రిపుల్‌ఐటీ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం ప్రారంభించారు. వివిధ రకాల ఆటలపోటీలు క్యాంప స్‌లో నిర్వహిస్తున్నామని ప్రతి విద్యార్థి క్రీడల్లో గెలుపోటములను సహజంగా తీసు కొని ముందుకు సాగాలని డైరెక్టర్ తెలిపారు. ఏఓ రవికుమార్, డీన్ రమేష్, కోఆర్డినేటర్ వెంకటేష్, పీడీలు శంషాద్‌బేగం, రమణారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ బుధవారం రాత్రి కడపకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

బుధవారం అనంతపురం జిల్లాలో పర్యటన కార్యక్రమాన్ని ముగించుకొని రాత్రికి కడప ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. గురువారం ఉదయం 10 నుంచి 11 వరకు ఎస్సీ నాయకులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తారు. అదే సమయంలో కలెక్టర్‌తో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4గంటల వరకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారని ఈడీ తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని ఏపీఎం సుజాత తెలిపారు. బుధవారం స్థానిక బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుజాత మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమానహక్కులు వర్తిస్తున్నాయని, డ్వాక్రా సంఘాలు మహిళల జీవనోపాధికి తోడ్పడుతున్నాయన్నారు. ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

సుండుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతు సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం మండలంలోని సుండుపల్లె-3, ముడుంపాడు రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరూ రైతు విశిష్ట సంఖ్యను పొందాలని కోరారు. నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి త్వరలో గుర్తింపు కార్డులు జారీ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత మహిళకు ఆర్థిక సాయం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని వడ్డిపల్లెకు చెందిన సోనీ అనే మహిళకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు బుధవారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కీర్తిపాటి ప్రసాద్ వర్మ, అధ్యక్షులు ముద్దలూరు చంద్ర మోహన్ రాజు, కోశాధికారి పొన్నూరు నిరంజన్‌బాబు, డైరెక్టర్లు శ్రీనివాసులు, కే. బాలకృష్ణంరాజు, ఎస్. మస్తాన్‌సాహెబ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

రాజంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ తెలిపారు. బుధవారం గీతాంజలి విద్యాలయం 18వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీ నారాయణ, మైనార్టీ నాయకుడు షామీర్‌బాషా, నాగేశ్వర నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణంరాజు తదితరులు మాట్లాడారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే వెనుకబాటు

- రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు గత ప్రభుత్వ నిర్వాకమే..
- మున్సిపాలిటీ అభివృద్ధి బాధ్యత కౌన్సిల్‌దే..
- రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మదన్‌మోహన్‌రెడ్డి



మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సర్ట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యమే రాయచోటి పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యకు కారణమని కౌన్సిలర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నిర్వహించిన రాయచోటి మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి 2021లోనే రూ.236 కోట్లు మంజూరు కాగా, 300 కిమీ పైబడి పనులు చేయాల్సి ఉండగా, కనీసం 50 కిమీ పనులు పూర్తి కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెలిగల్లు నుంచి పట్టణానికి పైప్‌లైన్ ఏర్పాటు పాటు 5 ఓహెచ్‌ఆర్‌ఆర్ ట్యాంక్‌ల నిర్మాణానికి రూ.98 కోట్లు మంజూరు కాగా, ఏ ఒక్క ట్యాంకు పిల్లరూ 5 అడుగుల ఎత్తుకు మించి నిర్మించలేదని ధ్వజమెత్తారు. రూ.6.50 కోట్లతో తిరుపతినాయుడు కాలనీలో మొదలు పార్కు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లను డబ్బులు అడగడం వల్లే వాళ్లు వెళ్లిపోయారని ఆయన ఆరోపించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృషితో వెలిగల్లు నుంచి 6 మండలాలకు సాగునీరు, తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో రూ.300 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సంబేపల్లె పర్యటనకు వచ్చినప్పుడు రాయచోటి ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయాలని మంత్రి కోరారన్నారు. కంచాలమ్మ చెరువు పునరుద్ధరణకు రూ.7.70 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపారన్నారు. ఇనాయత్ ఖాన్ చెరువు అభివృద్ధికి ప్రతి పాదనలు పంపారని, మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత కౌన్సిల్‌పై ఉందన్నారు.

రాయచోటిలో రీజనల్ డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్, రీజనల్ డ్రైవింగ్ ట్రైనింగ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి కృషి చేస్తున్నారని వివరించారు. పట్టణంలో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చూసుకోవాలన్నారు. అక్రమ వసూళ్లను తక్షణమే అరికట్టాలని ఆయన అధికారులను కోరారు. పట్టణంలో పాత బస్టాండ్, అన్న క్యాంటీన్, తామ్ స్కూల్ వద్ద ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆయన సభ దృష్టికిక తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో పాటు వైస్ చైర్మన్ ఫయాజ్ రెహమాన్ కౌన్సిలర్ చాన్‌బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వంతో కూడా అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి మున్సిపాలిటీలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేశామన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ : చమర్తి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ వచ్చిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం మండలంలోని తిమ్మసముద్రం కస్పాలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో రూ.13 కోట్లతో ఇప్పటి వరకు పలు రకాల రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. మరో రూ.6 కోట్లతో రాజంపేట నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అనుమతుల కోసం వేచి చూస్తున్నామని తెలియజేశారు. అనుమతులు రాగానే వందశాతం నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప, టీడీపీ నాయకులు ప్రసాద్‌రాజు, శివరాంనాయుడు, వేములయ్య, సురేశ్ నాయుడు, శివరాం, మస్తాన్, కల్పన, జనసేన మహిళా నాయకులు రెడ్డిరాణి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబునాయుడు, బెల్లాల రమణ, బీసీ నాయకులు మంగిరి సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి రైల్వే కోడూరు సమస్యలు



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. కడప -రేణి గుంట రోడ్డు అభివృద్ధి, నరసరాంపేట వద్ద రక్షణ గోడ నిర్మాణం, కోడూరు-వెంకటగిరి రోడ్డు తదితర అంశాలపై ముఖ్యమంత్రికి విన్నవించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అడిగారని ఆయన వివరించారు.

ఎన్‌సీడీ సర్వే తనిఖీ

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) సర్వేను జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ రవిబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పెద్దపల్లి, మహబూబ్ నగర్, ఆరోగ్యమందిర్ పరిధిలో వైద్య బృందం నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, గర్భసంచి, ఛాతీ పరీక్షలు చేయాలన్నారు. అనుమానిత కేసులను రిమ్స్ స్పెషలిస్టు విభాగానికి రెఫర్ చేయాలని సూచించారు. పూర్తిగా వివరాలను సంబంధిత యాప్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్ జ్యోతి, వైద్యసిబ్బంది జయమ్మ, రామయ్య, రాహుల్, ఉమా, భార్గవి, రాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 రైతుసేవా కేంద్రాన్ని ఏవో రమేష్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలని, క్షేత్రస్థాయి పనులకు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, రైతుసేవా కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

ఎర్రప్పగారిపల్లెలో ఆక్రమణ తొలగింపు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపేట పంచాయతీలోని కొనసానివారిపల్లె, ఎర్రప్పగారిపల్లె మధ్యలో ఆక్రమణకు గురైన దారిని బుధవారం అధికారులు పునరుద్ధరించారు. దారి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు అందడంతో రెవెన్యూ సిబ్బంది ఆ ప్రాంతాన్ని బుధవారం సర్వే చేశారు. ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ కావడంతో దారిని పునరుద్ధరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, మండల సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి, వీఆర్వో యామిని పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ తొలగిస్తాం

గాలివీడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువుల సంత వద్ద ఉన్న నరసన్నకుంట చెరువు ఆక్రమణను తొలగిస్తామని తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. ఆక్రమణకు గురైన చెరువు స్థలాన్ని బుధవారం ఆమె సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసన్నకుంట చెరువు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో ప్రసన్నలత, మండల సర్వేయర్ మురళి, గ్రామ సర్వేయర్ హేమనాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

జాతరలో వసతులు కల్పించాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా వసతులు కల్పించాలని ఆర్‌డీవో శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక గంగమ్మ ఆలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య, ఆరోగ్య, పారిశుధ్యం, పార్కింగ్ ఏర్పాట్లు నిర్వహణపై సూచనలిచ్చారు.

మనుషులంతా ఒక్కటే..: ఓ ప్రార్థన మందిరం విషయంలో రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదంపై స్థానిక ఎంపీడీవో సభాభవనంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఇరువర్గాల వాదనలు విన్నారు. ప్రార్థన స్థలం ప్రాంగణంలో పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పరిశీలిస్తామని తప్పు చేసినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో తహల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్' ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్ సంస్థను రద్దు చేసి, తాత్కాలిక ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాజంపేటలోని సీయూటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్ సంస్థను రదు చేసి ఆ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలను ప్రవేశ పెడతామని ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించడంతో ఆప్కాస్‌లో ఉన్న పొరుగుసేవల కార్మికులందరిలో భయాందోళనలు నెలకొన్నాయన్నారు. కావున వెనువెంటనే ఆ కార్మికులను పర్మినెంట్ చేస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ యూనియన్ నాయకులు రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, ఓబయ్య, పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌జీఆర్‌లో ఘనంగా 'ఫేర్‌వెల్ డే'

గాలివీడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెడ్డెప్పగారి రాజగోపాల్‌రెడ్డి జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం ఇంటర్ ద్వితీయ, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచిపేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని, వచ్చే వార్షిక పరీక్షల్లో అత్యధికమార్కులు సాధించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ సంస్కారవంతంగా పెద్ద పట్ల గౌరవం కలిగి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. అధ్యాపకులు గంగిరెడ్డి, రవి, ఈశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌నాయుడు, రాజా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

తాగు, సాగునీరు అందించాలి

రామాపురం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రామాపురం రైల్‌మిల్లు దగ్గర బుధవారం రైతులతో కలసి ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23, 24 తేదీల్లో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాంతీయ మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మహబూబ్‌బాషా, రామచంద్రయ్య, రమణయ్య, మరి కొంత మంది రైతులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు టవళ్లు పంపిణీ



విద్యార్థులకు టవళ్లు పంపిణీ చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో ప్రేమ్‌సాగర్

పెనగలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు బుధవారం హాస్టల్ వార్డెన్ హరిప్రసాద్ అధ్యక్షతన రాజంపేట ఏఎస్‌డబ్ల్యూఓ ప్రేమ్‌సాగర్ టవళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్లో విద్యనభ్యసించిన ఎంతోమంది గొప్పస్థాయికి ఎదిగారన్నారు. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో పంచాయతీ కార్యదర్శి ప్రతిభ



కప్‌తో సురేష్‌బాబు

పెనగలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ రాయలసీమ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పెనగలూరు పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు రన్నర్‌గా నిలిచారు. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరు పట్టణంలో ఈ పోటీలు నిర్వహించారు. ఆయన ఆటతీరును పరిశీలించిన వ్యాయామ అధికారుల బృందం వ్యక్తిగత కప్ ఇచ్చి ఘనంగా సత్కరించింది. బుధ వారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయరావు, ఏవో పద్మ భూషణ్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్, పలు కార్యాల యాల సిబ్బంది సురేష్‌బాబును ఘనంగా సన్మానించారు.

శ్రీరాముడి గుణాలే రామాయణం విశిష్టత

నందలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాముని విశిష్ట గుణాలే రామాయణం విశిష్టత అని తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అన్నారు. తెలుగులో రామాయణాలు - సామాజిక దృక్పథం అనే అంశంపై కడపలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు రామాయణం విశిష్టత అనే అంశంపై తాను సమర్పించిన పరిశోధక పత్రానికి కార్యక్రమ నిర్వాహకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు పార్వతి, యోగి వేమన శిశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఎస్. ఈశ్వర్‌రెడ్డి తదితరులు గంగనపల్లి వెంకటరమణను శాలువా ధ్రువీకరణ పత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పని చేస్తున్న పాఠశా ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, ఉపాధ్యాయులు తదితరులు గంగనపల్లి వెంకటరమణను అభినందించారు.

ప్రశాంతంగా సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు మూడు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు పెద్ద ఎత్తున నిరుద్యోగులు హాజరయ్యారు.



రైల్వేకోడూరు: ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న గది బయట వేచివున్న అభ్యర్థులు

పెనగలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ఎస్.విజయరావు అధ్యక్షతన సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 234 మంది దరఖాస్తు చేసుకోగా 158 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా పెనగలూరు, ఓబిలి, ఏపీజీబీ పెనగలూరు, చక్రంపేట బ్యాంకుల ప్రతినిధులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు.

చిట్వేలి : మండలంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్పొరేషన్ రుణాలకు 266 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు 236 మంది హాజరయ్యారు. అన్ని బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మోహనకృష్ణ, ఎంపీడీవో మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలో 513 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 217 మంది హాజరైనట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. యూనిట్‌ల తనిఖీ అనంతరం రుణాల మంజూరు ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

చిన్నమండెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 312 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు.

వీరబల్లి: వీరబల్లి బీసీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నూర్జహాన్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 221 మంది అభ్యర్థులు హాజరయ్యారు

రైల్వేకోడూరు: మండలానికి వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు 87 యూనిట్లు మంజూరు కాగా, 529 మంది దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి నాగార్జునరావు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలో 310 మంది దరఖాస్తు చేసుకోగా 185 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలిపారు. ఓబులవారిపల్లెలో పెద్దఎత్తున అభ్యర్థులు హాజరయ్యారు

అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యాశాఖాధికారి-1 పద్మజ, సీడీపీవో శోభారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ జ్ఞానజ్యోతి 120 రోజుల కోర్సులో భాగంగా మొదటి విడత 50 మంది అంగన్వాడీలకు మిషన్ భారత్ ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాలు, వాటి సాధనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో పద్మజ మాట్లాడుతూ రెండు విడతలుగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటపాటల ద్వారా అభ్యసనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, సూపర్‌వైజర్‌లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నీతి శతకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు

చిట్వేలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నీతి శతకాల ఆధారంగా పిల్లలకు మంచి నేర్పించాలని ఎంఈవో ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ అన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం తెలుగు ఉపాధ్యాయుడు కవి, మండల సుభాష్ చంద్ర బోస్ రచించిన సన్ని శతకం, తెలుగువీర శతకం పుస్తకాలను అంగ న్వాడీ కార్యకర్తలకు ఉచితంగా పంపిణీ చేశారు. అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఉన్న ఈ పద్యాలను చదివి, పిల్లలకు చెప్పాలని తెలిపారు.

శివపార్వతులకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను అందజేస్తున్న గురుప్రసాద్ దంపతులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఏటా మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేస్తుంటారు. ఈ ఏడాది ఉత్సవాల ఆరంభానికి ముందుగా వారు ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిపేరుతోనే మదనపల్లెలో డిగ్రీ కళాశాలను నెలకొల్పామని తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి





మాట్లాడుతున్న ఎంపీడీవో జాషువా, హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

రామాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గడికోట విజయలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సభాభవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జాషువా అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. అనంతరం పంచాయతీరాజ్ ఇంజనీర్ జగదీశ్ మాట్లాడుతూ మండలంలో తొలి విడత సిమెంటు రోడ్డు పనులు పూర్తయ్యాయని, రెండో విడత పనులు మొదలు పెడుతున్నామన్నారు. ఎంఈవో రామకృష్ణుడు మాట్లాడుతూ నీలకంఠ్రావుపేట బాలికల సంక్షేమ హాస్టల్ అభివృద్ధి కోసం 12 లక్షల రూపాయలు మంజూరయ్యాయన్నారు. వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీలోపు ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకుని రైతు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కందులను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఉలవ, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వ్యాధిపై సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో జాషువా, ఎంఈవో రామకృష్ణుడు, ఏవో నాగమణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్‌లో..
రూ.కోట్లు వృథా..!


చింతపర్తి మార్కెట్ యార్డు

- శిథిలమవుతున్న భవనాలు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ సర్కార్
- కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని రైతుల వేడుకోలు


చింతపర్తి మార్కెట్ యార్డులో మందుబాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు


వాల్మీకిపురం మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వ్యాపార దుకాణాల సముదాయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సరిగ్గా 13 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ నేడు శిథిలావస్థను తలపిస్తోంది. కోట్ల ప్రజాధనం వృథా కావడంతో పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. వాల్మీకిపురం సమీపంలోని మర్రిపాడు మార్గంలో 2013లో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.3.40 కోట్ల వ్యయంతో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డును ప్రారంభించారు. మంచి సంకల్పంతో రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా రూపుదిద్దుకోవాలన్న అప్పటి ప్రభుత్వం, పాలకుల ఆశలు నీరుగారాయనే చెప్పాలి. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, పాలకులు ఏమాత్రం రైతుల సౌకర్యాలు, అవసరాలు గుర్తించకపోవడంతో నేడు మార్కెట్ శిథిలాలను తలపిస్తోంది. వాల్మీకిపురం మార్కెట్ ప్రారంభించిన రోజుల్లో వాల్మీకిపురం, కలకడ మండలాల ప్రాంతాల నుంచి ప్రతినిత్యం సుమారు 150 టన్నుల టమోటాలు మార్కెట్‌కు రావడం, క్రయవిక్రయాలతో సందడి వాతావరణం ఉండేది. కాలక్రమేణా ఇక్కడి మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లో టమోటా పంట సాగవుతూ నిత్యం రైతులు, వ్యాపారుల సందడితో కళకళలాడే మార్కెట్ నేడు వెలవెలబోతోంది. అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన భవనాలు కూడా వృథాగా మారాయి. రైతులు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఉపయోగంలోకి తెచ్చిన పాపాన పోలేదు. యార్డు ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ కూడా మరుగున పడింది. కనీస సౌకర్యాలు, పర్యవేక్షణ లేకనే రైతులు వాల్మీకిపురం మార్కెట్‌కు రావడం లేదన్న వాదన గట్టిగా వినిపిస్తుండటం గమనార్హం. ఎటువంటి రక్షణ లేకపోవడంతో మార్కెట్ యార్డు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతున్నాయి.

అలాగే మండలంలోని చింతపర్తి గ్రామంలో గల మార్కెట్ యార్డు కూడా దుస్థితికి చేరుకుంది. రైతుల ఉపయోగం ఎలా ఉన్నా ఎవరికి తోచిన రీతిలో వారు వాడుకుంటున్నారు. మార్కెట్ కార్యాలయ భవనాలు కూడా అక్రమ నిల్వల గోదాముగా మారిపోవడం గమనార్హం. ఎటు చూసినా మందుబాబుల ఆగడాలతో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రూ.1.57 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డు ప్రస్తుతం ఎటూ కాకుండా నిరుపయోగంగా మారింది. గత వైసీపీ పాలనలో వ్యవసాయ మార్కెట్లను పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమైనా వ్యవసాయ మార్కెట్ యార్డులపై దృష్టి సారించాలని కోరుకుంటున్నారు. చింతపర్తి మార్కెట్ ఎంతో అనుకూలంగా ఉండేదని, ప్రస్తుతం కలకడ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోందని సమీప గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ల తీరుతో మండీల యజమానులు కూడా తాము వ్యాపారాలు కోల్పోయి ప్రతినెలా చేతి నుంచి బాడుగలు కట్టే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తుండటం గమనార్హం. వాల్మీకిపురం యార్డు ఆవరణలో 8 వ్యాపార దుకాణ సముదాయాలు ఉన్నప్పటికీ ఏళ్లకాలంగా తెరచుకోకపోవడం వ్యాపారాలు కొనసాగకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి మార్కెట్ యార్డుల సముదాయాలలో సౌకర్యాల కల్పన, పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ సెక్రటరీ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. రైతులు మార్కెట్‌కు రాకపోవడం కారణంగా ఈ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పడం కొసమెరుపు.

మార్కెట్ లేక ఇబ్బందులు



చింతపర్తి వ్యవసాయ మార్కెట్ లేకపోవడంతో కలకడ, కలికిరి, మదనపల్లె ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతకు మించి పండించిన టమోటా పంట రవాణా ఖర్చులు కూడా భారంగా మారుతున్నాయి. ప్రభుత్వం చింతపర్తి మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ఎస్.ఆనంద్, రైతు, పెరుమల్లయ్యగారిపల్లె, వాల్మీకిపురం

రైతుల గోడు పట్టించుకోవాలి



మా గ్రామానికి 5 కి.మీ. దూరంలో ఉన్న మార్కెట్‌యార్డు మూతపడడంతో 25 కి.మీ. దూరంలో కలకడ మార్కెట్‌కు టమోటాలను రవాణా చేయాల్సి వస్తోంది. గడ్డు పరిస్థితులలో సైతం రైతులు తీవ్రంగా నష్టపోయిన సమయాన రవాణా ఖర్చుల భారం, పంటల నష్టం కోలుకుండా చేస్తోంది. అదే మా గ్రామ సమీపంలో ఉన్న చింతపర్తి మార్కెట్‌లో ప్రభుత్వం చొరవ చూపి బాగు చేసినట్లయితే సమీప గ్రామ రైతులందరికీ ఎంతో మేలు కలుగుతోంది. పాలకులు, రైతులు కూడా రైతుల సమస్యలు, ఇబ్బందులను గుర్తించాల్సిన అసరవం ఎంతైనా ఉంది.

-జయచంద్రనాయుడు, రైతు, శాకంవారిపల్లె, వాల్మీకిపురం

ఇష్టారాజ్యంగా నిధుల దుర్వినియోగం

చిన్నగొల్లపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సుండుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న గొల్లపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయంటూ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య గత డిసెంబరు లో కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అదే నెలలో విచారణ చేశారు. రూ. 1,13,100 సాధారణ నిధులు, రూ. 2,63,125 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేల్చారు. దీంతో చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో మస్తాన్‌వలి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు బుధవారం తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని ఫిర్యాదుదారు రెడ్డిచర్ల శివశంకరయ్య ఆరోపిస్తున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

రామసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీపల్లెలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అయితే వారు వచ్చేలోపే గడ్డివాములకు మంటలు పూర్తిగా వ్యాపించాయి. సిబ్బంది మంటలార్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామానికి చెందిన ఆర్.చెంగారెడ్డి, పి.చంద్రప్పకు చెందిన గడ్డి వాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.60 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకుకు గాయాలు

రామాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి కథనం మేరకు రాయచోటి పట్టణానికి చెందిన తిరుపతి చంద్ర తన కుమారుడు సాయికుమార్‌తో కలసి బైక్‌పై రామాపురం మండలం రాచపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు వెళ్లి వస్తుండగా, చిట్లూరు హరిజనవాడ సమీపంలో కుక్కను తప్పించే యత్నంలో బైక్ అదుపు తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని 108 వాహనంలో క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురికి జైలుశిక్ష

కలకడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో నిందితులైన నలుగురికి వాల్మీకిపురం కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు బుధవారం పేర్కొన్నారు. ఆయా కేసుల్లో నిందితులైన నాగేంద్ర, బాలాజి, షాబ్‌జాన్, వెంకటరమణలను బుధవారం వాల్మీకిపురం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.16 వేలు జరిమానా, వారం రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

174 కేజీల గంజాయి స్వాధీనం

- విలువ రూ.17.40 లక్షలు
- చిన్నమండెంకు చెందిన భార్యాభర్తల అరెస్టు

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.17.40 లక్షల విలువైన 174 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... మంగళవారం రాత్రి వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ39వీఏ9012 నెంబరు గల ఆటో పోలీసులను గమనించి వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా గుర్తించిన పోలీసులు ఆటోను వెంబడించి పట్టుకున్నారు. దానిని పరిశీలించగా అందులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ, రాజమ్మ దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆటోతో పాటు గంజాయిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందులో పరిశీలించగా 90 ప్యాకెట్లలో 174 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు సూత్రధారులు పరారయ్యారని పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వేదపండితులు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామివారి కలాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, ధనుష్ సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 81 ప్రత్యేక బస్సులు


యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న మదనపల్లె-1 డిపో మేనేజర్ వెంకట్రమణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం 81 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ మూరే వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ వన్‌డిపోలో బుధవారం అన్ని యూనియన్ నాయకులతో రూట్ సూపర్‌వైజర్లు గ్యారేజ్ సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మదనపల్లె నుంచి తంబళ్లపల్లె వరకు 20 బస్సులు, తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి కొండ కిందకు 10 సర్వీసులు, కొండ కింద నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ పైకి 35 సర్వీసులు నడుపుతున్నట్లు బీఎం పేర్కొన్నారు.

ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు కండెక్టర్ ఉంటారని తెలిపారు. అలాగే పెద్దమండ్యం-తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2 బస్సులు, బి.కొత్తకోట-తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2, ములకలచెరువు -తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. మదనపల్లె వన్ డిపో- అంగళ్లు సమీపంలోని మల్లయ్యకొండకు 10 బస్సులు నడుపుతున్నామన్నారు. ఇదిలా ఉండగా తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి ఆధ్వర్యంలో పెద్దమండ్యం, బి.కొత్తకోట, ములకలచెరువు నుంచి మూడు ఉచిత బస్సులను భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, బాబ్జి, వి.వి. రమణ రెడ్డి, బాషా, శివయ్య, ఎంసీ శేఖర్ చంద్రయ్య, అసిస్టెంట్ మేనేజర్ రేవతి, ఎం.ఎఫ్. రవి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రార్థన స్థలం విషయంలో వాగ్వాదానికి దిగిన రెండు వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలోని హైస్కూల్ వెనుక ఉన్న ప్రార్థన స్థలం విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వివాదాస్పద స్థలం వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని వివరించారు. ఎవరైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ కట్టడం కూల్చివేత


ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

రాజంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. రాజంపేట మండలం కూచివారిపల్లెలో వత్తలూరు ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్సు నిర్మించారని ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఆధ్వర్యంలో విచారణ చేసి, సర్వే నంబరు మార్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు , ఈ ప్రాంతంలో దాదాపు రెండు ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇందులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును బుధవారం సబ్‌కలెక్టర్ నిదియాదేవి ఆధ్వర్యంలో తహసీల్దారు పీరుమున్నీ, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు.

గుండాలకోనకు 12 శాశ్వత కాశీ శివలింగాలు



చిట్వేలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలకోన కర్కటేశ్వర స్వామి సన్నిధికి 12 శాశ్వత పంచామృత కాశీ శివలింగాలు ప్రతిష్ఠించనున్నట్లు గుండాలకోన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాశీ శివలింగాలను పెద్దూరు గ్రామానికి ప్రత్యేక పూజలతో గ్రామోత్సవంగా తీసుకువచ్చారు. అనంతరం రాత్రికి గుండాలకోనకు శివలింగాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యా! ఏడు నెలలైనా..
మా సమస్యలు పరిష్కరించలేదు

- సిసోడియా ఎదుట గోడు వెల్లబోసుకున్న బాధితులు


రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అయ్యా.. ఏడు నెలల క్రితం మీరు మదనపల్లెకు వచ్చినప్పుడు తాము ఇచ్చిన అర్జీలు ఇంత వరకు పరిష్కారం కాలేదని పలువురు అర్జీదారులు రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియాతో మొరపెట్టుకున్నారు. బుధవారం మదనపల్లెకు వచ్చిన సిసోడియాతో పలువురు అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. సిసోడియాకు గతంలో ఇచ్చిన అర్జీలపై కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు పలుసార్లు అర్జీలు ఇచ్చామని, ఇంతవరకు ఆయా మండలాల తహసీల్దార్లు తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. ముఖ్యంగా భూముల వివాదాలు, వన్-బీలో పేర్ల నమోదు, సర్వే సమస్యలపై అధికారులు నాన్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 మందికి పైగా ప్రజలు సిసోడియాకు అర్జీలు అందజేశారు. ఈ అర్జీలన్నింటికి టాప్ ప్రియారిటీ ఇచ్చి, విచారించి పరిష్కరించాలని, కోర్టు కేసులుంటే ఎండార్స్‌మెంట్లు ఇవ్వాలని సిసోడియా సబ్‌కలెక్టర్‌కు సూచించారు.

భూములకు పాసుపుస్తకాలు ఇవ్వండి



మా పిత్రార్జితంతో పాటు, నేను కొనుగోలు చేసిన భూములకు పాసుపుస్తకాలు మంజూరు చేయండి. కోర్టులో మాకు అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు మా ప్రత్యర్థుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై పూర్తిగా విచారించి మాకు న్యాయం చేయండి. ఏడు నెలలుగా నా సమస్య పరిష్కారం కాలేదు.

- రామచంద్రారెడ్డి, వెంగంవారిపల్లె, నిమ్మనపల్లె మండలం.

మా భూములపై ఇతరులకు వన్-బీ ఇచ్చేశారు



మదనపల్లె మండలం బసినికొండ రెవిన్యూ గ్రామం కొండామరిపల్లెలో సర్వే నెంబర్ 431లో తమకు చెందిన భూములకు వన్-బీ మంజూరుకు ఏడు నెలల క్రితం అర్జీ ఇచ్చాము. ఆ భూమికి సంబంధించి వేరే వారికి వన్-బీ మంజూరు చేశారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయండి సార్. ఏడు నెలల నుంచి అన్ని కార్యాలయాలకు తిరుగుతున్నా న్యాయం జరగలేదు.

- ఏ.వెంకటరమణారెడ్డి, కొండామర్రిపల్లె, మదనపల్లె మండలం.

వివాదాల భూమిని డిస్పూట్ రిజిస్టర్‌లో పెట్టండి



కురబలకోట మండలం మట్టివారిపల్లె గ్రామం సర్వే నెంబర్ 630/1లోని 6.69 సెంట్ల భూమిపై వివాదం నడుస్తోంది. పూర్తి విచారణ అయ్యేంత వరకు ఈ భూమిపై ఎవరికి పాసుపుస్తకాలు మంజూరు చేయొద్దు. దీనిపై పలుమార్లు అర్జీలు సమర్పించాను. ఇప్పటికే తహసీల్దార్, సబ్‌కలెక్టర్‌కు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. దీనిపై విచారించి ఈ భూమి వివరాలను డిస్పూట్ రిజిస్టర్‌లో నమోదు చేయించాలి.

- దావూద్‌ఖాన్, సీటీఎం, మదనపల్లె మండలం.

రోడ్డు రోలర్ కింద పడి వ్యక్తి మృతి


వివరాలు సేకరిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉండగా మూర్ఛ రావడంతో రోడ్డు రోలర్ డ్రైవర్ తాను నడుపుతున్న వాహనం కిందే పడి మృతి చెందిన హృదయ విదారకమైన సంఘటన మండల పరిధిలోని మంగంపేట పరిధిలో బుధవారం చోటుచేసుకుంది.

రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు కడప జిల్లా సీకె దిన్నె మండలానికి చెందిన కిరణ్‌కుమార్(36) రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఆయన రోడ్డు రోలర్‌తో మండల పరిధిలోని గోవిందంపల్లె - మంగళంపల్లె రోడ్డు మలుపు వద్ద వెళుతుండగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి, అదే వాహనం కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

పట్టపగలే చోరీ


ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్ టీం

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిర్మలగిరికాలనీలోని ఓ ఇంట్లో పట్టపగలే జరిగింది. బాధితుడి కథనం మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు ఆర్ఎంపీ వైద్యుడు వీరభద్రుడు ఇంటికి తాళాలు వేసి మాధవరంలో ఉన్న క్లినిక్‌కు వెళ్లగా, ఆయన భార్య వీరమ్మ బ్యాంకు పనిమీద నందలూరుకు వెళ్లింది. ఉదయం 11 గంటలకు ఇంటికి వెళ్లగా, తలుపులకు ఉన్న తాళాలు తొలగించినట్లు కనిపించడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, బీరువా పగులగొట్టి అందులోని రూ. 2 లక్షలు నగదు, 30 తులాల బంగారం అపహరించినట్లు తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, క్రైం సీఐ భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు బాధితుడు తెలిపాడు.

పొలం పిలుస్తున్నా... రారేమి...!


పొలం పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

- కార్యక్రమంపై అవగాహన భ్రమ
- పత్తాలేని అనుబంధ శాఖల అధికారులు
- మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులను సాగులో సుశిక్షితులను చేసి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు గ్రామాల్లోని రైతుల క్షేత్రాలను సందర్శించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, పురుగులు, తెగుళ్లు, నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అన్ని సమస్యలపై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు మినహా మిగిలినవారు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ కార్యక్రమం ప్రభుత్వ లక్ష్యానికి దూరం అవుతోంది.

వారానికి నాలుగు గ్రామాలు

ఉమ్మడి కడప జిల్లాలో 66 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 66 మండలాల్లో ఒక్కో మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున 264 గ్రామాలు, నెలకు దాదాపు 1056 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

నిర్వహణ సాగాలిలా...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలం బాట, పంట సాగుపై చర్చలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర సమస్యలకు తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహించాలి.

మిగతావారేరి...

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖలైన హార్టికల్చలర్, సిరికల్చలర్, ఫిషరీస్, వెటర్నరీ శాఖ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, విద్యుత్తు, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వీరితోపాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీ, సబ్సిడీలను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. 2024-25 ఏడాదికి సంబంధించి సెప్టెంబరు 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి విడత షెడ్యూలు పూర్తయి ప్రస్తుతం రెండో విడత షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రబీ సీజన్ కావడంతో అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. మొదటి షెడ్యూలులో జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మాత్రమే పాల్గొన్నారు. మిగిలినశాఖ అధికారుల జాడ లేదని రైతులు వాపోతున్నారు.

అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అన్ని అనుబంధ శాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలి. ఆయా శాఖల పథకాలను తెలియజేసి, రైతుల సమస్యలు పరిష్కరించాలి. అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా చూస్తాం.

\- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి


అవగాహన కార్యక్రమానికి హాజరైన కొందరు రైతులు

ముందస్తు సమాచారం లేక వెలవెల

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు వారి షెడ్యూళ్ల ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చాలా మందికి అవగాహన భ్రమగానే మారిందని విమర్శలు ఉన్నాయి.

మానవ మనుగడకు అడవులు ముఖ్యం

- సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు అడవులు ఎంతో ముఖ్యమని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన ఎఫ్ఆర్వో జయప్రసాదరావు, స్థానిక అటవీ సిబ్బందితో కలిసి తంబళ్లపల్లె మల్లయ్యకొండను సందర్శించారు. తొలుత శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కొండపైన అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మరుగుదొడ్లు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకుల సందర్శన కోసం త్వరలో కొండపైన వాచ్‌టవర్‌తో పాటు రెండు పగోడాలు నిర్మించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొండకు వచ్చిన పర్యాటకులు ప్రకృతి అందాలతో పాటు, అడవి మొత్తాన్ని తిలకించేలా ఎత్తైన ప్రాంతంలో వాచ్‌టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా అడవిలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు గుర్తించడానికి వీలుగా కూడా వాచ్‌టవర్ ఉపయోగపడుతుందన్నారు. వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో రెడ్డివరప్రసాద్, ఎఫ్‌బీవో రామరాజు, రాజారెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎం దృష్టికి రైల్వే కోడూరు సమస్యలు


సీఎంకు సమస్యలు వివరిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. కడప-రేణిగుంట రోడ్డు అభివృద్ధి, సరసరాంపేట వద్ద రక్షణ గోడ నిర్మాణం, కోడూరు-వెంకటగిరి రోడ్డు తదితర అంశాలపై ముఖ్యమంత్రికి విన్నవించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సందర్భంగా ముఖ్య మంత్రి అడిగారని ఆయన వివరించారు.

పోలతలలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమూర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

పెండ్లిమర్రి; ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని పొలతలలో జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమా ర్‌లు తెలిపారు. పొలతల క్షేత్రంలోని పరిపాలన భవనంలో కలెక్టర్, ఎస్పీలు వివిధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వ హించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు తాగునీరు, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా, నిరంతరం వైద్య శిబిరాలు, 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడా లన్నారు. భక్తులకు కోసం బస్సులు నడపాలని, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలని, కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్ల మర మ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్యూలైన్లు, సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవం సమయంలో గట్టి పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. ముందుగా మల్లేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, ఈఓ కృష్ణానాయక్, జెడ్పీ సీఈఓ ఓబు లమ్మ, డీఎంహెచ్ఓ నాగరాజు, డీపీవో రాజ్యలక్ష్మి, ఆలయ పెద్దలు రాజారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొల్లసాహితీ పురస్కార ప్రదానం


మలయవాసిని విఠలరావు దంపతులు, ఆచార్య విజయలక్ష్మికి పురస్కారం ప్రదానం చేస్తున్న గానుగపెంట

కడప కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కోలవెన్ను మలయవాసిని విఠలరావు దంపతులకు, హైదరాబాదు సెంట్రల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు ఆచార్య విజయలక్ష్మికి మొల్ల సాహితీ పురస్కారాలను అందించారు. బుధవారం స్థానిక కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో వారిని సత్కరించి నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఆచార్య మలయవాసిని మొల్ల రామాయణానికి పరిమళం అనే పేరుతో 435 పేజీలతో విశేష వ్యాఖ్యానం రాసి తెలుగు జాతికి మహత్తర కానుకగా అందించారు. ఈ గ్రంథాన్ని టీటీడీ వారు ముద్రించారు. కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహా కవయిత్రి పేరుతో సాహిత్య పీఠాన్ని నెలకొల్పి.. రెండు దశాబ్దాలకు పైగా ఆమె జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అభినందనీయుడన్నారు. మొల్ల సాహిత్యపీఠం కార్యాలయంలో నిక్షిప్తం చేసిన గ్రంథాలయాన్ని, జ్ఞాపికలను, ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశీలించి ప్రశంసించారు. తాను రాసిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్యను సాహిత్యపీఠానికి అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనేకొనసాగించాలి

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రా మీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష కోరారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసిన ఆయన మాట్లాడుతూ ఏపీజీబీ రైతులకు, మధ్యతరగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కరువుపీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. అన్ని రంగాల్లో ముందస్తులో ఉండడం, ఎక్కువ టర్నోవర్ ఉండడంతో కడప మరియాపురంలో 2015లో రూ.15కోట్లతో అన్ని సౌకర్యాలతో ప్రధా న కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రభు త్వం పరిగణలోకి తీసుకుని, విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేయాలని కోరారు.

ఎక్సైజ్ సీఐపై కేసు నమోదు

కడప క్రైమ్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాగ్య నగర్ కాలనీ వాసి శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరిలో ఎక్సైజ్ సీఐగా విధులను నిర్వహి స్తున్న శ్రీనివాసమూర్తిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు. బాధితుడి నుంచి 2016 లో తన ఇంట్లో వారి బంగారు ఆభరణాలను విడిపిం చుకునేందుకు డబ్బు కావాలని రూ.9లక్షలను అప్పుగా తీసుకున్నాడు. డబ్బు తీసుకున్న సమయంలో కడప ఎక్సైజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే వారు. తరువాత సీఐగా పదోన్నతి రావడంతో మంగళ గిరిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డబ్బు ను ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడప క్రైమ్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విషద్రావణం తాగి చికిత్స పొందుతున్న హుసేన్ బాష(38) మృతి చెందాడు. కడప నగరం ఉక్కాయపల్లి వాసి హుసేన్ బాష కువైట్‌లో సెల్ ఫోన్ దుకాణంలో పనిచేస్తుండేవాడు. ఆ సమయంలో తొమ్మిది లక్షల నగ దు మాయం కావడంతో ఆ డబ్బు కట్టాలని వారు చెప్ప డంతో సొంత ఊరికి వచ్చాడు. అది భరించలేక తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల విషద్రావణం తాగాడు అతనికి రిమ్స్‌లో చేర్చి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ మెరిట్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

వేముల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగంశెట్టి పద్మావతి (54) హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ కె.కె.కొట్టాల సమీపంలో ఎనుములు మేపుకొంటూ ఉండ గా ఆమెను గుర్తుతెలియని వ్యక్తులు దాడి చంపారు. ఆమె తాళిబొట్టు బంగారు గొలుసు, చెవికమ్మలు దొం గిలించారన్నారు. మృతురాలు కూతురు గోగుల దివ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. కేసులో సింగంశెట్టి రమేష్‌ను అరెస్టు చేసి, బంగారు గొలుసు, కమ్మలు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి


మాట్లాడుతున్న జేడీఏ నాగేశ్వరరావు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవ సాయంపై రైతుల్లో అవగాహ న పెంపొందించి, ఔత్సాహిక రైతులకు వనరులను సమకూర్చాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాలులో రాష్ట్ర వ్యసాయశాఖ, రైతు సాధికారసంస్థ సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) జిల్లాలో అమలు తీరు, విస్తరణపై వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయసాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ సహాయకుల, వ్యసాయాధికారులు, హార్టికల్చర్ సహాయకులు అధికారులు బాధ్యత వహించాలన్నారు. సంప్రదాయ వ్యవసాయసాగు పద్ధతులను అమలు చేసేందుకు గ్రామాలను యూనిట్‌గా తీసుకొని వీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఈప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో స్థలం అనుకూలత ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో లేదా పాఠశాలల్లో న్యూట్రీస్ గార్డెన్స్ ఏర్పాటుకు మ్యాపింగ్ చేయాలన్నారు. బయో డైవర్సిటీ విధానం ద్వారా అన్ని రకాల పంటలను పండించేలా రైతులను, యువతను ప్రోత్సహించాలన్నారు.

ఆటో బోల్తా - వ్యక్తి మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు సమీపంలో మంగళవారం ఆటో బోల్తాపడి గాయపడిన ముత్యాలపాడు మునెయ్య (37) బుధవారం కర్నూలులోని ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. సంఘటనలో అతని భార్య, ముగ్గురు పిల్లలకు స్వల్పగాయాలైనట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహిళ ఆత్మహత్య

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన ఆవుల సురేఖ అనే మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. భర్త శ్రీనివాసులతో మనస్పర్థలు ఉండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని...

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామక్రిష్ణనగర్‌కు చెందిన ఉరి వేసుకుని చిన్నముజాహ్నవి (15) ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. చిన్నముజాహ్నవి పదోతరగతి వరకు చదివి ఇంటి వద్ద ఉంటోంది. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా ముగిసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పులివెందుల రూరల్, ఫిబ్రవరి 19: పులివెందులలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బ్రహోత్స వాలలో భాగంగా ప్రతి రోజూ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చివరి రోజైన బుధవారం హంస వాహనం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివా రిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ చింతకుంట సుధీ కర్‌రెడ్డి, ఈవో కొట్టే వెంకటరమణ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కాశినాయన ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె నర్సాపురం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో కాశినాయన మండలం చాలా వెనుకబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. తహసీల్దారు వెంకటసుబ్బయ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వాటికి పరిష్కార మార్గాలు చూపాలని జేసీ అతిథిసింగ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాల యాన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ సదస్సుల్లో స్పందనలో వచ్చిన అర్జీల గురించి విచారించారు. వీలైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి కార్యాలయాల చుట్టూ తిరగకుండా పరిష్కారమార్గాలు చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడేళ్లుగా వేతనాల పెంపులేదు.. జీవనం ఎలా?


డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకులు

వేంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం రూ.25వేల వేతనంతో చేరాం.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదు.. ఇలాగే కొనసాగితే మేము ఎలా జీవనం సాగించాలంటూ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేసే తాత్కాలిక అధ్యాపకుల అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డైరెక్టర్ కుమారస్వామి గుప్తకు వినతి పత్రం అందించారు. 110జీఓ ప్రకారం రూ.33వేల వేతనం ఇవ్వాలని కోరారు. వచ్చే నెల నుంచి అమలయ్యేలా చూడాలని, సమస్యను రిజిస్ట్రార్, వీసీల దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. సమస్యను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డైరెక్టర్ తాత్కాలిక అధ్యాపకు లకు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమా రస్వామి గుప్త తెలిపారు. క్యాంపస్ ఆవర ణలో ట్రిపుల్‌ఐటీ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం ప్రారంభించారు. వివిధ రకాల ఆటలపోటీలు క్యాంప స్‌లో నిర్వహిస్తున్నామని ప్రతి విద్యార్థి క్రీడల్లో గెలుపోటములను సహజంగా తీసు కొని ముందుకు సాగాలని డైరెక్టర్ తెలిపారు. ఏఓ రవికుమార్, డీన్ రమేష్, కోఆర్డినేటర్ వెంకటేష్, పీడీలు శంషాద్‌బేగం, రమణారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంపై అన్నదమ్ముల మధ్య ఘర్షణ


గాయపడిన సుబ్బయ్య, శ్రీనివాసులు

కాశినాయన ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లెలో భూ సమస్యపై అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో రెండు కుటుంబాల వారికి రక్తగాయాలయ్యాయి. ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోడెపాటి శ్రీనివాసులు, సుబ్బయ్య ఇరువురు అన్నదమ్ములు. వీరి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూవివాదం నడుస్తోంది. ఈస్థలంలో మంగళవారం శ్రీనివాసులు గోకులం షెడ్డు నిర్మించేందుకు యత్నించాడు. సుబ్బయ్య అడ్డుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు కర్రలతో రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈసం ఘటనలో శ్రీనివాసులకు, సుబ్బయ్యకు కొంతమందికి రక్తగాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు రెండు కుటుంబాల వారిపై కేసు నమోదు చేశామన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రోహిత్



కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో 22 నుంచి 26 వరకు జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కడపలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీకాలేజీ విద్యార్థి రెడ్డి రోహిత్ కుమార్ ఎంపికయ్యారు. 2024 అక్టోబ రులో నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రెడ్డి రోహిత్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఆ విద్యార్థి ఎంపిక పట్ల సం బంధిత కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి హర్షం వెలిబుచ్చారు.

నేడు జిల్లాకు మాల కార్పొరేషన్ ఛైర్మన్ రాక

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ బుధవారం రాత్రి కడపకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

బుధవారం అనంతపురం జిల్లాలో పర్యటన కార్యక్రమాన్ని ముగించుకొని రాత్రికి కడప ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. గురువారం ఉదయం 10 నుంచి 11 వరకు ఎస్సీ నాయకులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తారు. అదే సమయంలో కలెక్టర్‌తో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4గంటల వరకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారని ఈడీ తెలిపారు.

తహసీల్దార్‌గా అమరనాథ్



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నూతన తహసీల్దార్‌గా బుధవారం అమరనాథ్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ధనంజేయులు మదనపల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో నందలూరులో తహసీల్దార్‌గా పని చేస్తున్న అమరనాథ్ నిమ్మనపల్లికు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుండి సేవలు అందిస్తానని, అదేవిధంగా సిబ్బంది రీ-సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కురబలకోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలానికి 53 యూనిట్లు మంజూరు కాగా 414 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గంలో సలీంబాషా

బి.కొత్తకోట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులుగా బి.కొత్తకోట పట్టణానికి చెందిన సలీంబాషా, వేణుగోపాల్ రెడ్డిలు ఎంపికయ్యారు. రైల్వేకోడూరులో ఈ నెల 16, 17 లలో జరిగిన జిల్లా మహాసభలలో ఎంపికైన నూతన కార్యవర్గంలో వీరికి చోటు దొరికింది. ఈ సందర్భంగా బుధవారం వీరు మాట్లాడుతూ కార్మికుల, పేదల సమస్యలపై ఎర్రజెండా ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): టెంకాయలు కోయడానికి చెట్టునెక్కి 40 అడుగుల పైనుంచి ఓ వ్యక్తి పడిపోయిన సంఘటన మండలంలోని గట్టు పంచాయతీ కొండకిందపల్లెలో బుధవారం జరిగింది. డేగానిపల్లెకు చెందిన సోమశేఖర్ (35) టెంకాయల వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారం కోసం టెంకాయల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేత



లోకేశ్‌ను కలిసిన మనోహర్‌నాయక్

పెద్దమండ్యం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం తిరుపతి విమానాశ్రయంలో ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ కలిసి మాట్లాడారు. తిరుపతి పర్యటన సందర్భంగా విచ్చేసిన లోకేశ్‌కు స్వాగతం పలికిన వారిలో ఆయన ఉన్నారు. మండలంలోని ఎస్టీ గిరిజన గ్రామ పంచాయతీ రామానాయక్ తాండ సమీపంలో ప్రభుత్వ క్రీడ పాఠశాల మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి దాతృత్వం

పీలేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.1.40 లక్షల పరికరాలు వితరణగా అందించి విశ్రాంత ఉపాధ్యాయుడైన బద్దల రాజారెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. రేగళ్ల పంచాయతీ కూరపర్తివారిపల్లెకు చెందిన రాజారెడ్డి 12 మంచాలు, వాటికి కావాల్సిన బెడ్లు, దిండ్లు, స్టూళ్లను బుధవారం వితరణగా అందజేశారు. తన తల్లిదండ్రులైన బద్దల సిద్దమ్మ, నాగిరెడ్డిల జ్ఞాపకార్థం ఆయన వాటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు అందజేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడికాయలపల్లె గ్రామానికి చెందిన తన భార్య సోనియా(24) ఈ నెల 16న అర్ధరాత్రి నుంచి అదృశ్యమైనట్లు రెడ్డిబాషా తెలిపారు. ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేదని పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగళ్లులో మళ్లీ భూ రగడ...

- వివాదాస్పద భూమిలో ప్రహరీగోడ
- ఆక్రమణదారులకు టీడీపీ నేత మద్దతు

కురబలకోట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లులో మళ్లీ భూ రగడ మొదలైంది. ముంబై-చెన్నై జాతీయ ప్రధాన రహదారిలోని అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న విలువైన భూమిని ఆక్రమించుకోవడానికి ఆక్రమణదారులు చొరబడ్డారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్ 220లో 69.42 ఎకరాల భూమి ఉండగా ఇందులో దాదాపుగా 7.66 ఎకరాల భూమికి సంబంధించి గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ భూమిలో ఆరేళ్ల క్రితం కొంతమంది ఆక్రమణదారులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో ఆ భూమిలో ఎవ్వరూ వెళ్లకుండా 145 సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం కొన్నేళ్ల పాటు ఈ భూమిలోకి ఎవ్వరూ వెళ్లలేదు. అయితే మూడేళ్ల క్రితం ఈ భూమిని ఆక్రమించుకోవడానికి పులివెందులకు చెందిన వ్యక్తులు ప్రయత్నించారు. అప్పట్లో వివాదం నెలకొనడంతో వైసీపీకి చెందిన పలువురు రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి డబ్బులు వసూలు చేసి సెటిల్ చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధినేతల అండతో ఇప్పటి వరకు మూడు సార్లు తిరుపతి, అనంతపురంకు చెందిన పలువురు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. ఆ భూమిలో దాదాపుగా 100 మందితో మూడు ఎకరాలలో సిమెంట్ పెలకలతో ఫెన్సింగ్ వేశారు. అంతేకాకుండా భూ హక్కుదారులు అడ్డుకోవడానికి వెళ్లగా వారిపై దాడికి ప్రయత్నించడంతో భయంతో వెనుదిరిగారు. దీంతో ఆ భూమిలో రెండు రోజుల పాటు సిమెంట్ పెలకలతో ప్రహరీగోడను నిర్మించి వెళ్లిపోయారు. నిత్యం వివాదాలకు నెలవైన ఈ భూమి మార్కెట్‌లో రూ.కోట్లు పలుకుతోంది. కాగా ఈ భూ సమస్య పరిష్కారమవుతుందా లేక మళ్లీ పునరావృతం అవుతుందా వేచిచూడాల్సి ఉంది.



వివాదాస్పద భూమిలో ఫెన్సింగ్ వేసిన దృశ్యం

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకుని నియోజకవర్గంలోని శివాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద ఆయన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో వేంపల్లె మల్లయ్యకొండ, తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయం, రామసముద్రంలోని వాలీశ్వరస్వామి ఆలయం, పట్టణంలోని యోగభోగేశ్వరాలయం, సోమేశ్వరాలయం తదితర ఆలయాల వద్ద భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం వుందన్నారు. అధికారులు ముందుగా గుర్తించి, మెరుగ్గా సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసు అధికారులు తగిన బందోబస్తు నిర్వహించాలన్నారు. దీనిపై దేవదాయశాఖ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను ప్రదర్శిస్తే ఉద్యోగావకాశాలు



అవగాహన కల్పిస్తున్న సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ షబీన్‌తాజ్

కురబలకోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగవకాశాలను సాధించవచ్చని ఐఐటీ ప్రొఫెసర్ ముత్తుకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సుస్థిరమైన ఇంధన ఎంపికలు-కెరియర్ ఎంపికలు అనే అంశంపై వర్క్‌షాప్ ఏ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు తమలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి అవకాశాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకుని సమయస్ఫూర్తితో ఎదుర్కోవాలన్నారు. తులసీరామ్‌నాయుడు, రామనాథం పాల్గొన్నారు.

'అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు'

ములకలచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు పెట్టడం మానవాళికి ముప్పని బురకాయలకోట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ షబీన్ తాజ్ పేర్కొన్నారు. మండలంలోని బురకాయలకోట బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం అటవీ, వన్యప్రాణుల రక్షణ, అడవిలో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవికి నిప్పు పెడితే వన్యప్రాణులు, విలువైన వృక్ష సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అనంతరం అడవికి నిప్పు పెట్టడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతులకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను అందజేస్తున్న గురుప్రసాద్ దంపతులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్ర జ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామివారికి మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఏటా శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేస్తుంటారు. ఏడాది ఉత్సవాల ఆరంభానికి ముందుగా బుధవారం గురుప్రసాద్ దంపతులు ఆలయానికి చేరుకుని ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిపేరుతోనే మదనపల్లెలో డిగ్రీ కళాశాలను నెలకొల్పామని వారు తెలిపారు.

గురుకులంలో విద్యార్థులకు ఘన వీడ్కోలు

పీలేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో ఉన్న బాలికల గురుకులంలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లోకేశ్వరి మాట్లాడుతూ పదవ తరగతి మార్కులు జీవితాంతం ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థినులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుకులం బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై తీరిన మంచి నీటి సమస్య

- కొండపై నూతన బోరు డ్రిల్లింగ్ • 80 అడుగులకే పడిన నీరు



బోరులో నీరు పడిన దృశ్యం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండపై మంచి నీటి సమస్య తీరింది. బుధవారం మల్లయ్యకొండపై నూతన బోరు డ్రిల్లింగ్ వేయగా సుమారు 80 అడుగులకే 2 ఇంచీలకు పైగా నీరు పడింది. గతంలో మల్లయ్యకొండ పైకి కింద ఉన్న బోర్ల నుంచి పలు నీటి ట్యాంకుల ద్వారా నీటిని పంపింగ్(ఎత్తిపోతలు) చేసేవారు. దీంతో వేసవిలో బోర్లలో నీరు తగ్గిపోవడం, ట్యాంకుల్లో ఉన్న మోటార్లు మరమ్మతులకు గురి కావడం, ఎత్తిపోతల కారణంగా నీరు వృధా కావడం వంటి సమస్యలతో కొండ పైన నీటి సమస్య తలెత్తి భక్తులు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని స్థానిక కూటమి నాయకులు, దేవదాయశాఖ అధికారులు టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల మల్లయ్యకొండను సందర్శించిన ఆయన మహాశివరాత్రి ఉత్సవాలు దగ్గర్లో ఉన్నందున కొండపైన భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నీటి సమస్య తలెత్తకుండా నూతన బోరు డ్రిల్లింగ్ చేయాలని సూచించారు. దీంతో మంగళవారం నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, కురబలకోట మండలాధ్యక్షుడు వైజీ సురేంద్రలు కొండపైన బోరు పాయింట్ పెట్టించారు. బుధవారం సాయంత్రం నుంచి ఈవో మునిరాజ, కూటమి నాయకులు ఆధ్వర్యంలో బోరు డ్రిల్లింగ్ చేయగా నీరు పుష్కలంగా పడింది. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కృష్ణమూర్తినాయుడు, ఉత్తమ్‌రెడ్డి, సోముశేఖర్, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది కొండకిట్ట, భక్తులు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డుల కోసం స్క్రీనింగ్ టెస్టులు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎంలోని ఆదర్శ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డుల కోసం విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఎస్తాని తమ వైద్య సిబ్బందితో కలిసి బుధవారం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ శివకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పేరుతో ఒక కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, రక్త నమూనాలను పరీక్షించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కొరకు ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఒక్క ఐడీని సృష్టించి డిజిటల్‌గా భద్ర పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

- నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం



ర్యాలీలో పాల్గొన్న యువత, ప్రజలు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. యువజన సంఘాలు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, ప్రజల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా సాగాయి. స్థానిక నల్లవీరగంగా భవాని అమ్మవారి ఆలయం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ద్విచక్ర వాహనాల్లో భారీ ర్యాలీ చేపట్టారు. కొత్తపేటవీధి, గాంధీబస్టాండ్, ఎల్‌ఆర్‌వీధి, ఆర్టీసీ బస్టాండ్, తోటవీధి, బైపాస్ రోడ్డు, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల గుండా భారీ ద్విచక్రవాహన ర్యాలీ చేపట్టి శివాజీ మహరాజ్ నినాదాలు చేస్తూ బాణాసంచా కాలుస్తూ నగరోత్సవాలు చేపట్టారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద భారీ ఎత్తున నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విశ్రాంత సైనికోద్యోగి రవిచంద్ర, వాల్మీకి సేవాసమితి అధ్యక్షుడు విష్ణుచైతన్య, శివాజీ యువసేన బొక్కసం బ్రదర్స్, సాయి భార్గవ్, వెంకటేష్, రోహిత్, తిరుమలేష్, నాగేంద్ర, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాలు పెంపొందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ

కలకడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో విద్యను అభ్యసిస్తున్న పిల్లలో నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి సిబ్బందికి సూచించారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం లక్ష్యం-ప్రాముఖ్యతను పీడీ వివరించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీలో విద్యార్థుల హాజరును పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన



మద్యం దుకాణానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

పీలేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యాలయాలు, ఆసుపత్రులు ఉన్న తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని పీలేరు పట్టణం స్వామివివేకానంద సర్కిల్‌లోని ప్రజలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులు సర్కిల్‌లోని ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడ మద్యం దుకాణం వద్దని నిరసన చేపట్టారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

- నిరుద్యోగులతో కిక్కిరిసిన కార్యాలయాలు



ములకలచెరువులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో

నిమ్మనపల్లె/ తంబళ్లపల్లె/ ములకలచెరువు/ పెద్దమండ్యం/ పెద్దతిప్పసముద్రం/రామసముద్రం/బి.కొత్తకోట/కలకడ/పీలేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలుచోట్ల బీసీలకు సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు జరిగాయి. ఇందుకోసం నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో కార్యాలయాలన్నీ కిక్కిరిసిపోయాయి. సంబంధిత అధికారులు, బ్యాంకు సిబ్బంది లబ్ధిదారుల నుంచి అవసరమైన పత్రాలు తీసుకొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లె, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, రామసముద్రం, బి.కొత్తకోట, కలకడ, పీలేరు తదితర మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మోదీ పాలనలో అభివృద్ధి ఖాయం

- మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



తరిగొండలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం ఆయన అనుచరుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎప్పుడు ఏం చేయాలో ప్రధానమంత్రి మోదీకి బాగా తెలుసునన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులను మంజూరు చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని పేర్కొన్నారు. అనంతరం తరిగొండలో రెడ్డెన్న, దేవిక కుటుంబాలను పరామర్శించారు. అలాగే తలారివాండ్లపల్లెలో ఆనంద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు టి.జయప్రకాశ్, టి.రెడ్డెన్న, సర్పంచ్ ఆనంద్, మూర్తిరావు, నౌషాద్, శ్రీనివాసులు, హరిప్రసాద్‌నాయుడు, రామచంద్ర, ఎండీ జమీర్, పర్వేజ్, బయ్యారెడ్డి, నాగేంద్రరెడ్డి, ఆనంద్, విజయ్‌కుమార్, రెడ్డిప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని నగిరిమడుగు పశువైద్యాధికారిణి చరిత పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బీమా చేయించిన పశువులు మృత్యువాత పడితే రైతులు నష్టపోకుండా పరిహారం అందుతుందని ఈ పథకంలో ఆవులకు, గేదెలకు, గొర్రెలు, మేకలు, ఎద్దులు, కోడెలకు బీమా చేయించవచ్చన్నారు. రేషన్‌కార్డు కలిగి ఉన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరుస్తాం



భూమి పూజలో నిరంజన్‌రెడ్డి, తదితరులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతి సంక్షేమ పథకం ప్రజల దరి చేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నాయక్‌వీధి సమీపంలో రైల్వేగేట్ నివాసులకు రూ.10 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలన్నీ అందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సైతం సీసీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, గ్రామపంచాయతీ ఈవో రవీంద్రనాథ్, నాయకులు పీవీనారాయణ, కోసూరి చంద్రమౌళి, మురళి, రాజేంద్రాచారి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, తెలుగు యువత చాను, ఆదినారాయణ పాల్గొన్నారు.

మండల సర్వేయర్ బదిలీ

- నూతన సర్వేయర్‌గా కీర్తన

పీలేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న కిరణ్మయి బదిలీ అయ్యారు. ఆమెను గుర్రంకొండకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్న జిల్లా ఉన్నతాధికారులు ఆమె స్థానంలో కేవీపల్లెలో పనిచేస్తున్న కీర్తనను నియమించారు. ఈ మేరకు కీర్తన బుధవారం పీలేరు తహసీల్దారుకు రిపోర్టు చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ శ్రీధర్ పర్యటన అనంతరం పీలేరు మండల సర్వేయర్ బదిలీ ఉంటుందని పెద్దఎత్తున పుకార్లు చెలరేగడం విశేషం.

జగన్... బెదిరించడం మానుకో..!

- విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ములకలచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి అధికారులను బెదిరించడం మానుకోవాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. ములకలచెరువులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అధికారులను, పోలీసులను వాడుకుని ఎలా ఇబ్బంది పెట్టారో ప్రజలకు బాగా తెలుసునన్నారు. పోలీసులను ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రతిఒక్కరూ ఖండిస్తున్నారన్నారు. సమావేశంలో పార్లమెంటు మహిళా కార్యదర్శి గంగాదేవి, నాయకులు చాంద్‌బాషా, కాలా మహేష్, వేణుగోపాల్, రాము, మునిస్వామి, షఫీ, శంకర, రాజన్న, రఫీ, మధు, మస్తానప్ప, నారాయణ, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

మండల బీజేపీ అధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్‌నాయుడు

రామసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షులుగా ఆనందకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు శ్రీసాయిలోకేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు మండల బీజేపీ అధ్యక్ష ఎన్నికలు జరిపినట్లు ఆయన తెలిపారు. మండల అధ్యక్ష బాధ్యతలు తనకు అప్పగించిన మండల బీజేపీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలుపుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ అభివృద్ధి కోసం మరింతగా పని చేస్తానన్నారు. తాను డిగ్రీ చదివే రోజుల్లో ఏబీవీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నానని, బీజేపీ పట్ల ఆకర్షణ కలిగి 2013లో బీజేపీ మెంబర్‌షిప్ తీసికోవడం జరిగిందని, తరువాత 2016- 2019 వరకు మండల యువమోర్చా అధ్యక్షుడిగా, 2024 ఫిబ్రవరి నుంచి మండల అధ్యక్షుడిగా పనిచేశానని ఆనంద్‌కుమార్‌నాయుడు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ చెంబకూరు కృష్ణమూర్తి, చలపతి, బాబు, ప్రసాద్, కృష్ణ, శ్రీనివాసులు, ప్రతాప్, శివ, లోకేష్ రెడ్డి, రాజశేఖర్, వెంకటరమణ, వెంకటేష్, గంగాధర్, మణి, కదిరప్ప, శ్రీనివాసులు, మంజు, తదితరులు పాల్గొన్నారు.